



చెదిరిన సంకల్పం

పది విద్యార్థుల భవిష్యత్తు పట్టని విద్యాశాఖ

- పరీక్షలు సమీపిస్తున్నా.. అందని స్టడీ మెటీరియల్
- అనంత సంకల్పంపై దృష్టి పెట్టని ఇన్‌చార్జ్ డీఈఓ
- స్టడీ అవర్స్.. పాఠశాలల పర్యవేక్షణను విస్మరించారు
- కలెక్టర్ స్పందించాలని విద్యార్థి సంఘాల డిమాండ్

పదో తరగతి విద్యార్థుల భవిష్యత్తుకు భరోసా కరువైంది. పబ్లిక్ పరీక్షలు సమీపించినా.. జిల్లా విద్యాశాఖ అధికారులు శ్రద్ధ పెట్టడం లేదు. ప్రభుత్వ పాఠశాలలల్లో చదివే విద్యార్థులకు 'అనంత సంకల్పం' పేరుతో మెటీరియల్ అందించి, వారిని పరీక్షలకు సన్నద్ధం చేయాల్సి ఉంది. దీనికి గతంలో సుమారు వంద రోజుల యాక్షన్ ప్లాన్ అమలు చేసేవారు. ముందుగానే మెటీరియల్‌ను ముద్రించి, పాఠశాలలకు పంపేవారు. ఇది గతం. జగనన్న ప్రభుత్వం ఈ విషయంలోనూ రివర్స్‌లో వెళుతోంది. మార్చి 18 నుంచి పది పరీక్షలు మొదలౌతాయి. ఈ లెక్కన ఇంకో 44 రోజుల సమయం కూడా లేదు. ఇప్పుడు మెటీరియల్ ఇస్తామని గొప్పలు పోతున్నారు. పాఠశాలల్లో 10వ తరగతి విద్యార్థులకు మెటీరియల్ అందజేత, స్టడీ అవర్స్, పరీక్షల మాట ఎత్తేవారు లేకుండాపోయారు. ఇన్‌చార్జి డీఈఓ పర్యవేక్షణలో అనంత సంకల్పం ఆవిరవుతోందని ప్రధానోపాధ్యాయులు, విద్యార్థి సంఘాల నాయకులు మండిపడుతున్నారు. గతంలో జిల్లా కలెక్టర్లు అన్ని హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, సమీక్షలు చేసేవారు. కలెక్టర్ గౌతమి ఆ దిశగా దృష్టి సారిస్తారా..? లేక ఇన్‌చార్జ్ డీఈఓను నమ్ముకుని వదిలేస్తారా చూడాల్సి ఉంది.

అనంతపురం విద్య

ఏదీ నాటి శ్రద్ధ..?

పది పరీక్షలు అనగానే విద్యాశాఖ అప్రమత్తమయ్యేది. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను అమలు చేసేది. స్టడీ మెటీరియల్‌ను విద్యార్థులకు ఉచితంగా అందజేసేది. ఉపాధ్యాయులు ఉదయం, మధ్యాహ్నం జనరల్ స్టడీ అవర్స్ సాయంత్ర 4 గంటల నుంచి 5 గంటల వరకూ ప్రత్యే స్టడీ అవర్స్ నిర్వహించేవారు. స్టడీ అవర్‌లో చదువుకున్న అంశాలపై మరుసటి ఉదయం 8.30 గంటల నుంచి 9.15 గంటల వరకూ పరీక్షలు నిర్వహించేవారు. డీఈఓ, డిప్యూటీ డీఈఓ, ఎంఈఓలు తరచూ స్టడీ అవర్స్‌ను తనిఖీ చేసేవారు. గత ఏడాది కొత్తగా వచ్చిన డీఈఓ విద్యార్థుల ఇళ్ల వద్దకు నైట్ విజిట్స్‌కు వెళ్లేవారు. ఇలా ఎన్నెన్నో కార్యాక్రమాలతో విద్యార్థుల భవిష్యత్తు కోసం పాటుపడేవారు. కానీ ఈసారి కాసులు కురిపించే ఫైల్స్‌పై శ్రద్ధ పెడుతున్నారేగాని, విద్యార్థులపై కాదన్న విమర్శలను మూటగట్టుకుంటున్నారు.



జనవరి 24న అనంత సంకల్పం మెటీరియల్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్, ఇతర అధికారులు(ఫైల్)

స్టడీ మెటీరియల్ ఇప్పుడా ఇచ్చేది..?

పరీక్షలకు నెలన్నర కూడా సమయం లేదు. విద్యాశాఖ అధికారులు గత నెల 24న అనంత సంకల్పం మెటీరియల్‌ను కలెక్టర్ చేత విడుదల చేయించారు. ఇప్పటి వరకూ చాలా స్కూళ్లకు మెటీరియల్ చేరలేదు. గతంలో వంద రోజుల ముందే చేసే పనిని ఇప్పుడు పరీక్షలు ముంచుకొచ్చే సమయంలో మొదలు పెట్టారు. గతంలో అనంత సంకల్పం పర్యవేక్షణకు హెచ్ఎంలు, ఎంఈఓలతో మానిటరింగ్ కమిటీలు వేసేవారు. ఈ ఏడాది ఆ చర్యలే లేవు. పరీక్షలపై ఉన్నతస్థాయి సమీక్ష కూడా కనిపించడం లేదు. జిల్లా వ్యాప్తంగా 31,336 మంది రెగ్యులర్, 8,787 ప్రైవేట్ విద్యార్థులు పది పరీక్షలు రాయనున్నారు. విద్యాశాకాధికారులు ఇదే తరహా నిర్లక్ష్యం చూపితే.. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు తీరని నష్టం జరుగుతుందని విద్యార్థి సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.





డీఈఓ కార్యాలయం



ఇన్‌చార్జి డీఈఓ అశ్రద్ధ..

పదో తరగతి విద్యార్థుల పట్ల జిల్లా విద్యాశాఖాధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. ఇప్పటి వరకూ అనంత సంకల్పం మెటీరియన్‌ను కూడా ఇవ్వలేదు. ఇన్‌చార్జ్ డీఈఓ అధికార పార్టీ నాయకుల సేవలో తరిస్తున్నారు. కలెక్టర్ దృష్టి సారించకుంటే ఫలితాలు దారుణంగా పడిపోయే ప్రమాదం ఉంది.

- బండి పరశురాం, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి



పట్టించుకోకుంటే ఎలా?

విద్యార్థులకు 10వ తరగతి కీలకం. ఇక్కడ మార్కులు బాగుంటే భవిష్యత్తు బాగుంటుంది. జిల్లా విద్యాశాఖాధికారులు పది విద్యార్థులపై శ్రద్ధ పెట్టడం లేదు. తనిఖీలను విస్మరించారు. ప్రభుత్వ పెద్దలు మాత్రం విద్యకు పెద్దపీట అంటున్నారు. పరీక్షలకు నెలన్నర కూడా సమయం లేదు. ఇప్పుడు మెటీరియల్ ఇస్తే ఏం ప్రయోజనం..?

- పరమేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి



కలెక్టర్ దృష్టి పెట్టాలి..

జిల్లాలో విద్యాశాఖను గాలికి వదిలేశారు. కొందరు విద్యాశాఖ అధికారులకు ప్రైవేట్ స్కూళ్ల అనుమతులు, గుర్తింపు నుంచి ఎంత మామూళ్లు వస్తున్నాయన్న దానిపైనే శ్రద్ధ పెడుతున్నారు. పది పరీక్షలకు మరో 44 రోజులు మాత్రమే సమయం ఉంది. వంద రోజుల ముందు ఇవ్వాల్సిన మెటీరియల్‌ను ఇప్పుడు ఇవ్వడం ప్రారంభించారు. ఈ కాస్త సమయంలో ఎలా సిద్ధమౌతారు..? ఇదేనా ఇన్‌చార్జ్ డీఈఓకు ఉన్న శ్రద్ధ...? కలెక్టర్ దృష్టి సారించకుంటే విద్యార్థులు తీవ్రంగా నష్టపోతారు.

- నరేష్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధానకార్యదర్శి



పిల్లల భవిష్యత్తుతో చెలగాటం..

జిల్లా విద్యాశాఖ అధికారులు 10వ తరగతి విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకుంటున్నారు. ఎన్నికల వేళ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల గురించి ఏమాత్రం పట్టించుకోవడం లేదు. దీంతో జిల్లా విద్యాశాఖ అధికారులు ఆడిందే ఆట.. పాడిందే పాటగా తయారైంది. ఇప్పటికైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను కోరుతున్నాం.

- అబ్దుల్ ఆలం, ఏఐఎస్ఏ జిల్లా ప్రధానకార్యదర్శి

అప్పుడే మొదలైంది..!



వేపులపర్తి విద్యుత్ సబ్ స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు

వేసవి అనగానే తాగునీరు, కరెంటు కష్టాలు సర్వసాధారం అవుతున్నాయి. ఏటా పునరావృతం అవుతున్నా.. పరిష్కారం దిశగా అధికారులు, పాలకులు చర్యలు తీసుకోవడం లేదు. బ్రహ్మసముద్రం మండలం వేపులపర్తి సబ్ స్టేషన్ వద్ద రైతులు లో ఓల్టేజీ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం ఆందోళనకు దిగారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేదని, ఉన్న కాసేపూ ఓల్టేజీ సమస్యతో మోటార్లు కాలిపోతున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యుత్ శాఖ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా స్పందించడం లేదని వాపోయారు. ఏఈ ఎక్కడుంటారో కూడా తెలియదని, రైతుల పట్ల ఆయన నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేసేదాకా ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు. స్థానిక అధికారులు నచ్చజెప్పినా వినిపించుకోలేదు. ఉన్నతాధికారులు వచ్చి సమస్య పరిష్కారానికి హామీ ఇవ్వాలని పట్టుబట్టారు. దీంతో మండల అధికారులు ఉన్నతాధికారుతో ఫోన్‌లో మాట్లాడి, లో ఓల్టేజీ సమస్యను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. దీంతో రైతులు ధర్నాను విరమించారు. గోవిందయ్యదొడ్డి, వేపులపర్తి, చెలిమేపల్లి, ఎరడికెర తదితర గ్రామాల రైతులు ధర్నాలో పాల్గొన్నారు. - బ్రహ్మసముద్రం

నేత్రపర్వం.. నగరోత్సవం



ప్రత్యేక రథంపై వాసవీమాత



నగరోత్సవంలో పాల్గొన్న ఆర్యవైశ్యులు, వాసవీ దీక్షధారులు



కోలాటమాడుతున్న మహిళలు

వాసవీమాత దీక్షా మండలాన్ని పురస్కరించుకుని వాసవీ దీక్షాసమితి, కొత్తూరు ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అనంతపురం నగరంలో శుక్రవారం సాయంత్రం వాసవీమాత నగరోత్సవాన్ని నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన రథంపై వాసవీమాత ఉత్సవమూర్తిని ఊరేగించారు. భక్తుల కోలాటాలు, భజనలు ఆకట్టుకున్నాయి. కొత్తూరు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు గోపా మచ్చా నరసింహులు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సిరిగుప్ప వెంకటేష్, ప్రధాన కార్యదర్శి పోతుల మనోజ్ తదితరులు పాల్గొన్నారు.

- అనంతపురం కల్చరల్

అక్కాచెల్లెళ్ల ఆత్మహత్య

యాటకల్లులో విషాద ఘటన





రూప, జ్యోతి (ఫైల్)



తండ్రితో వివరాలు సేకరిస్తున్న అడిషనల్ ఎస్పీ, డీఎస్పీ

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 2: శెట్టూరు మండలం యాటకల్లులో అక్కాచెల్లెళ్లు రూప (19), జ్యోతి (18) శుక్రవారం ఉరివేసుకున్నారు. గ్రామానికి చెందిన చాకలి నారాయణస్వామికి ఇద్దరు భార్యలు. మొదటి భార్య మృతి చెందడంతో 22 ఏళ్ల క్రితం సరస్వతి అనే మహిళను వివాహం చేసుకున్నాడు. మొదటి భార్యకు కుమారుడు మనోహర్, రెండో భార్యకు ఇద్దరు కుతుళ్లు రూప, జ్యోతి ఉన్నారు. అనంతపురం నగరంలోని శ్రీసాయి కళాశాలలో రూప డిగ్రీ రెండో సంవత్సరం, జ్యోతి డిగ్రీ మొదటి సంవత్సరం విద్యార్థులు. కాలేజీ హాస్టల్ నుంచి వారం క్రితమే స్వగ్రామానికి వచ్చారు. కళ్యాణదుర్గం మండలం కుర్లపల్లిలో బంధువు మృతిచెందడంతో తల్లిదండ్రులు శుక్రవారం ఉదయం అంత్యక్రియలకు వెళ్లారు. ఇంటికి తిరిగొస్తున్నామని, స్నానానికి నీళ్ల సిద్దం చేయాలని చెప్పేందుకు ఉదయం 11 గంటల సమయంలో కూతుళ్లకు ఫోన్ చేశారు. స్పందించకపోవడంతో పక్కింటి వారికి ఫోన్ చేసి, తమ కూతుళ్లకు ఫోన్ ఇవ్వాలని కోరారు. వారు ఇంట్లోకి వెళ్లి చూసేసరికి ఇద్దరూ ఉరితాళ్లకు వేలాడుతూ కనిపించారు. దీంతో భయాందోళనకు గురైన పొరుగింటి వారు.. కేకలు వేస్తూ చుట్టుపక్కలవారిని పిలిచారు. ఆ తరువాత తల్లిదండ్రులకు సమాచారం అందించారు. రూప వంట గదిలో, జ్యోతి హాల్‌లో ఉరివేసుకున్నారు. విషయం తెలుసుకున్న అడిషనల్ ఎస్పీ రామిరెడ్డి విజయభాస్కర్‌రెడ్డి, డీఎస్పీ శ్రీనివాసులు సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. తండ్రి నారాయణ స్వామిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. మనోహర్ ఉదయం 11 గంటల సమయంలో మేకలు, గొర్రెలను తీసుకుని పొలానికి వెళ్లిపోయాడు. ఆ తరువాతే ఇద్దరూ ఉరి వేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని, మృతదేహాలను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కూతుళ్ల మృతితో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాదం అలుముకుంది.

అనారోగ్యంతోనే..

అక్కాచెల్లెళ్ల ఆత్మహత్యకు అనారోగ్య సమస్యలే కారణమని ఏఎస్పీ రామిరెడ్డి విజయభాస్కర్ రెడ్డి తెలిపారు. వారి తల్లి సరస్వతి కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారని, జ్యోతికి ఫిట్స్ సమస్య ఉందని తెలిపారు. రూప కూడా మైగ్రేన్‌తో ఇబ్బంది పడుతున్నారని, ఈ క్రమంలో జీవితంపై విరక్తి చెంది ఇద్దరూ ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. కళ్యాణదుర్గం రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు.



విలపిస్తున్న కుటుంబ సభ్యులు, బంధువులు

సొంబ చెబితే టిక్కెట్ ఇస్తారా..?

- మమ్మల్ని ఒక్క మాటైనా అడిగారా..?
- అభ్యర్థిని మార్చకుంటే ఓటమి తప్పదు
- టీడీపీ అభ్యర్థి 50 వేల మెజార్టీతో గెలుస్తారు
- సీఎం జగన్‌కు వైసీపీ అసమ్మతి నాయకుల అల్టిమేటం
- అనంతలో శింగనమల ఎమ్మెల్యే వ్యతిరేక వర్గం సమావేశం



సమావేశమైన శింగనమల వైసీపీ శ్రేణులు



మాట్లాడుతున్న యామినీబాల

బుక్కరాయసముద్రం, ఫిబ్రవరి 2: శింగనమల నియోజకవర్గంలో వైసీపీ అసమ్మతి భగ్గుమంటోంది. కొత్త ఇన్‌చార్జిగా ఇటీవల వీరాంజనేయులును పార్టీ అధిష్టానం ప్రకటించింది. సిట్టింగ్ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతికి సర్వేలో నెగిటివ్ రిపోర్ట్ రావడంతో.. అభ్యర్థిని మార్చింది. అయితే, ఎమ్మెల్యే భర్త ఆలూరు సాంబశివారెడ్డి సూచించిన వీరాంజనేయులును నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించడంతో ఎమ్మెల్యే వ్యతిరేకవర్గం తీవ్రస్థాయి అసంతృప్తి వ్యక్తం చేస్తోంది. అభ్యర్థిని మార్చాలని డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో అనంతపురం నగరంలో పలువురు సీనియర్ నాయకులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం సమావేశమయ్యారు. వార్డు మెంబర్ కూడా పనికిరాని వ్యక్తిని తీసుకుని వచ్చి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీకి నిలబెడతారా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. అభ్యర్థిని మార్చకపోతే శింగనమలలో టీడీపీ అభ్యర్థి ఇంట్లో కూర్చున్నా 50 వేల మెజార్టీతో గెలుస్తారని అన్నారు. నియోజకవర్గంలో వైసీపీకి ఇలాంటి గడ్డు పరిస్థితి వస్తుందని ఊహించలేదని పలువురు వ్యాఖ్యానించారు. ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి, ఆమె భర్త, రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య సలహాదారుడు ఆలూరు సాంబశివారెడ్డి, కొత్త ఇన్‌చార్జి వీరాంజినేయులకు వ్యతిరేకంగా ఐక్యంగా పనిచేయాలని తీర్మానించుకున్నారు. ఈ సమావేశానికి నియోజకవర్గంలో ద్వితీయ శ్రేణి నాయకులు, కార్యకర్తలు, మండ కన్వీనర్లు సుమారు 500 మందికిపైగా తరలిరావడం గమనార్హం. ఒక్కొక్కరుగా ముఖ్య నాయకులందరూ పార్టీలో తమకు జరిగిన అన్యాయాన్ని వివరించారు. జొన్నలగడ్డ పద్మావతిని గెలిపించడానికి ఇంట్లో ఉన్న బంగారాన్ని తాకట్టు పెట్టామని, అయినా ఒరిగింది ఏమీ లేదని పార్టీ శింగనమల కన్వీనర్ నాగేశ్ అన్నారు. ఆమె ఎమ్మెల్యే అయ్యాక వారి కుటుంబ సభ్యులే రూ.కోట్లు సంపాదించుకున్నారని అన్నారు. వారి బంధువులకు సకల భోగాలు అందాయని, సామన్య కార్యకర్తలు, ద్వితీయ శ్రేణి నాయకులకు ప్రాధాన్యమే లేకుండాపోయిందని అన్నారు. వీరాంజినేయులును అభ్యర్థిగా కొనసాగిస్తే భవిష్యత్తు కార్యచరణను రూపొందించుకుంటామని అన్నారు. మరి కొందరు నాయకులు టీడీపీ జెండా పట్టుకుని గ్రామ గ్రామాన ఆలూరు సాంబశివారెడ్డి అవినీతిపై ప్రచారం చేస్తామని హెచ్చరించారు. బుక్కరాయసముద్రంలో ఆలూరు రమణారెడ్డి, నార్పలలో రఘునాథరెడ్డి, గార్లదిన్నెలో నరేంద్రరెడ్డి, శింగనమలలో శ్రీరామిరెడ్డి, పుట్లూరులో రాఘవరెడ్డి, యల్లనూరు భోగాతి ప్రతాప్‌రెడ్డిని నియమించుకుని.. పార్టీకోసం పనిచేసిన వారిని పక్కన పెట్టారని మండిపడ్డారు. గడిచిన ఐదేళ్లలో పది రూపాయలు కూడా సంపాదించుకోలేదని అన్నారు. సామన్య కార్యకర్తలకు ఎమ్మెల్యే ఎలాంటి పనులు చేయలేదని, వారి సొంత పనులు చేసుకుని రూ.కోట్లు కూడగట్టుకున్నారని మండిపడ్డారు. ఎన్నికల్లో వైసీపీ ఓడిపోతే.. ఆలూరు సాంబశివారెడ్డి కాలేజీలో ఉంటారని, తాము ప్రజల్లో ఉంటామని అన్నారు. ప్రశాంతంగా ఉన్న పుట్లూరు, యల్లనూరు మండలాల్లో సాంబశివారెడ్డి ఫ్యాక్షన్ గొడవలు సృష్టించి నాశనం చేశారని ఆరోపించారు.

సీఎంతోనే తేల్చుకుంటాం..

అనంతపురం జిల్లా పర్యటనకు ఈ నెల 11న సీఎం జగన్ వస్తున్నారని, ఆ రోజున ఆయనతోనే శింగనమల అభ్యర్థి విషయాన్ని తేల్చుకుంటామని అసమ్మతి నాయకులు ప్రకటించారు. అభ్యర్థి ఎంపిక విషయంలో తప్పు చేశారని జగన్‌కు నేరుగా చెబుతామని అన్నారు. అభ్యర్థిని మార్చే వరకు పోరాటం చేస్తామన్నారు. త్వరలోనే పది వేల మందితో మరో సమావేశం ఏర్పాటు చేస్తామని అన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిని మార్చాలని కోరడంతోపాటు.. ఆలూరు సాంబశివారెడ్డి పర్యవేక్షణలో పనిచేయలేమని జగన్‌కు చెబుతామని అన్నారు. అభ్యర్థి ఎంపిక సమయంలో నియోజకవర్గ నాయకులు, కార్యకర్తల అభిప్రాయాలను అడగలేదని, సీఎం జగన్ అయినా ఈ విషయం గురించి ఆలోచించి ఉంటే బాగుండేదని అన్నారు. ఆలూరు సాంబశివారెడ్డి చెప్పిన వారికి టిక్కెట్ ఇస్తే ఈ ఎన్నికల్లో ఓటమి తప్పదని సీఎం దృష్టికి పోతామని అన్నారు.

అసమ్మతి సమావేశానికి మాజీ ఎమ్మెల్యే యామినీబాల, నార్పల మండలం నుంచి మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ సత్యనారాయణరెడ్డి, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మిద్దె కుళ్లాయప్ప, కార్యదర్శి చాములూరి రాజగోపాల్, ఎంపీపీ నాగేశ్వరావు, జెడ్పీటీసీ నాగరత్నమ్మ, పలువురు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, శింగనమల మండల కన్వీనర్ నాగేష్, గోకుల్ కుమార్ రెడ్డి, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, బుక్కరాయసముద్రం ఎంపీపీ సునీత, సాకే రామక్రిష్ణ, మాజీ ఎంపీపీ రాజశేఖర్ రెడ్డి, సహకార సంఘం చైర్మన్ వెంకటరెడ్డి, మాజీ చైర్మన్ నాగలింగారెడ్డి, బోనా నాగలింగారెడ్డి, యల్లనూరు సింగిల్‌విండో అధ్యక్షుడు కిరణ్ కుమార్, మండల కన్వీనర్ వెంకటేశ్ నాయకుడు పుట్లూరు, యల్లనూరు మండలాల నుంచి తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి వర్గీయులు హాజరయ్యారు.

చెరువు మట్టితో దందా

- ఇప్పేరు చెరువులో మాఫియా
- అధికార పార్టీవారికి అధికారుల సహకారం



అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 2: మైనర్ ఇరిగేషన్ అధికారుల్లో కొందరిని బుట్టలో వేసుకుని.. మట్టి మాఫియా చెలరేగిపోతోంది. చెరువులలో మట్టిని గుట్టుచప్పుడు కాకుండా తరలించి సొమ్ము చేసుకుంటోంది. అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లో ఈ దందా నడుస్తోంది. కూడేరు మండలం ఇప్పేరు చెరువు నుంచి అక్రమంగా మట్టిని తవ్వి తరలిస్తుండగా, అంతరగంగ గ్రామస్థులు టిప్పర్‌ను అడ్డుకున్నారు. చెరువుల్లో మట్టి సారవంతమైనది. పొలాలకు రైతులు తరలించుకోవాలన్నా అనుమతి తీసుకోవాల్సిందే. అలాంటిది యంత్రాలను చెరువుల్లో పెట్టి.. భారీ వాహనాలతో మట్టిని తరలించి సొమ్ము చేసుకుంటుఆన్నరు. మైనర్ ఇరిగేషన్, భూగర్భగనులు, రెవెన్యూ, పోలీసు శాఖలో కొందరి సహకారంతోనే ఈ దందా నడుస్తోందని గ్రామీణ ప్రజలు ఆరోపిస్తున్నారు.

దెబ్బతిన్న దారులు

మట్టి తరలింపు కోసం భారీ వాహనాలను వినియోగించడంతో గ్రామీణ రహదారులు దెబ్బతిన్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజుల క్రితం మట్టి తరలిస్తున్న ఓ టిప్పర్‌ను అడ్డుకున్నారు. చెరువుల్లో మట్టిని తరలించేందుకు మైనర్ ఇరిగేషన్, మైనింగ్, రెవెన్యూ శాఖలు సమన్వయంతో అనుమతి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే మైనర్ ఇరిగేషన్‌లో ఓ కీలక ఇంజనీరు, మరో ఇంజనీర్ కలిసి ముడుపులు పుచ్చుకుని, అనుమతి లేకుండానే మట్టిని తరలించేలా ఏర్పాటు చేయించారని సమాచారం. మట్టి మాఫియా ఆగడాలపై అంతరగంగ గ్రామ ప్రజలు నిలదీయడంతో కేసులు పెడతామని చెప్పి అధికారులు తప్పించుకుంటున్నారు.

కేసు పెట్టాలని సూచించాం..

ఇప్పేరు చెరువులో మట్టి తరలింపునకు అనుమతి లేదు. మూడు రోజులుగా కొంతమంది మట్టిని తరలిస్తున్నట్లు మా దృష్టికి వచ్చింది. అంతరగంగ గ్రామస్థులు మట్టిని తరలిస్తున్న వాహనాలను అడ్డుకున్నారు. గ్రామస్థులతో కలిసి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని మా సిబ్బంది, ఇంజనీర్లకు సూచించాం. కేసు పెట్టి వాహనాలను సీజు చేయాల్సిన బాధ్యత పోలీసులదే. మట్టి తరలింపులో ఎవరి ప్రమేయం ఉన్నా ఉపేక్షించేదిలేదు.

- ప్రతాప్, మైనర్ ఇరిగేషన్ ఈఈ

ఆధిపత్యపోరు

మట్టి దందాలో అధికార పార్టీవారి మధ్య ఆధిపత్య పోరు కారణంగా ఈ అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఓ వర్గం అక్రమ రవాణా చేస్తే మరో వర్గం అధికారులకు ఫిర్యాదు చేస్తోంది. గ్రామస్థులు నిలదీయడంతో మైనర్ ఇరిగేషన్ అధికారులు కేసులు పెడతామని అంటున్నారు. డివిజన్ పరిధిలో మూడేళ్లుగా పాతుకుపోయిన ఓ అధికారి.. వైసీపీ నాయకులతో కలిసి మట్టి అక్రమ రవాణాను ప్రోత్సహిస్తున్నారని ఆరోపణలు ఉన్నాయి. వైసీపీ నేతలతో చేతులు కలిపి ఆయన జేబులు నింపుకుంటున్నారని ఆ శాఖ ఇంజనీర్లే చర్చించుకుంటున్నారు. ఇప్పేరు చెరువు పక్కనే హంద్రీనీవా నీటి కాలవ ఉంది. మట్టి తవ్వకాల కోసం చెరువులోకి నీరు వదలనివ్వకుండా ప్రభావితం చేస్తున్నారంటే.. పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. మట్టి దందా కారణంగా రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు.



కంకరతేలిన అంతరగంగ -ఇప్పేరు రోడ్డు


కంబదూరులో వివాదం

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం వివాదాలు, గొడవలకు దారితీస్తోంది. జిల్లా యంత్రాంగం పట్టించుకోక పోవడంతో క్రీడాపోటీల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. జిల్లా వ్యాప్తంగా గత ఏడాది నవంబరు లో ఈ కార్యక్రమం ప్రారంభమైంది. అసలు సిసలైన క్రీడాకారులను వదిలేసి గ్రామీణ ప్రాంతాల్లో ఎటువంటి క్రీడాప్రావీణ్యం లేని వారితో ఆటలు ఆడించడంతోనే గొడవలు ఏర్పడుతున్నాయని పలువురు చెబుతున్నారు. క్రీడా పోటీలకు అవసరమైన కనీస వసతులు తాగునీరు, నీడ, భోజనం ఏర్పాటు చేసేందుకు నిధులు చెల్లించకుండా ప్రభుత్వం కాలయాపన చేస్తోంది. ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో యువత ఓట్లు కొల్లగొట్టేందుకే రాష్ట్ర ప్రభుత్వం క్రీడాపోటీల పేరుతో ప్రచారార్భాటాలు చేస్తోందని పలువురు విమర్శిస్తున్నారు.

అనంతపురం క్లాక్‌టవర్

గలాటా ఆంధ్ర

గొడవలకు దారితీస్తున్న 'ఆడుదాం ఆంధ్ర'

- నిధులు లేక ఇబ్బంది పడుతున్న నిర్వాహకులు
- పట్టించుకోని జిల్లా యంత్రాంగం
- అస్తవ్యస్తంగా మారిన పోటీల నిర్వహణ

పోటీల్లో పలుచోట్ల గొడవలు

జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో పలు చోట్ల గొడవలు జరుగుతున్నాయి. కళ్యాణదుర్గం, గుంతకల్లు, అనంతపురం, తాడిపత్రి ఇలా ఆయా ప్రాంతాల్లో క్రీడాకారుల మధ్య కొట్టుకునేవరకు వెళ్లిన సంఘటలు ఉన్నాయి. అనంతపురం పీటీసీలో, కంబదూరు, గుంతకల్లు ప్రాంతాలలో క్రీడాకారులు భౌతిక దాడులకు పాల్పడిన సంఘటనలు నిర్వహణ లోపానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. క్రీడలతో సంబంధం లేని వారిని క్రీడా పోటీలలో ఆడించడంతోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయనే వాదనలు వినిపిస్తున్నాయి.

అధికారుల మధ్య సమన్వయలోపం

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల నిర్వహణ బాధ్యత ఆయా జిల్లా కలెక్టర్లకు అప్పగించారు. జిల్లా యంత్రాంగం క్రీడలు ప్రారంభించిన తొలిరోజు మాత్రమే చుట్టపుచూపుగా వచ్చి వెళ్లారు. ఇక ఆ తరువాత దాన్ని పట్టించుకోలేదు. గ్రామ-వార్డు సచివాలయాలకు నిర్వహణ బాధ్యత అప్పగించడంతో సామర్థ్యం, సిబ్బంది, అవగాహనలోపంతో గందరగోళంగా మారింది. సాధారణంగా క్రీడా పోటీలు ఆయా క్రీడా సంఘాలు, శాప్, డీఎస్‌ఏ ద్వారా నిర్వహిస్తారు. ప్రభుత్వం ఇందుకు విరుద్ధంగా గ్రామ-వార్డు సచివాలయాల ద్వారా నిర్వహించడంతోనే అధికారుల మధ్య సమన్వయ లోపం ఏర్పడుతోందనే అభిప్రాయం వ్యక్తం అవుతోంది.

చిన్న చిన్న గొడవలు సాధారణమే

ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలలో అక్కడక్కడ చిన్నచిన్న గొడవలు జరిగిన మాట వాస్తవమే. అయితే పోటీల ప్రక్రియ విజయవంతంగా సాగుతోంది. గ్రామ-వార్డు సచివాలయం స్థాయి, మండల స్థాయి పోటీలు ముగిశాయి. నియోజకవర్గం, జిల్లా, రాష్ట్ర స్థాయిలో పోటీలు మలివిడతలో సాగుతున్నాయి. అనేక మంది క్రీడాకారులకు పోటీల్లో భాగస్వామ్యం చేయడమే ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీల ప్రధాన లక్ష్యం. వేలాది మంది క్రీడాకారులు పోటీల్లో ఆడుతుండటం శుభపరిణామం. భవిష్యత్తులో ఈ పోటీలు కొనసాగుతాయని ప్రభుత్వం చెబుతోంది. ఇదొక మంచి అవకాశంగా క్రీడాకారులు భావిస్తున్నారు.


- నరసింహారెడ్డి, డీఎస్‌డీఓ

ఆర్ట్స్ కళాశాలలో ఖాళీగా దర్శనమిస్తున్న టెంట్లు




అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్ స్టేడియం

అంతా కొట్లాటే!

- అస్తవ్యస్తంగా ఆడుదాం ఆంధ్ర పోటీలు
- పోలీసు బందోబస్తు నడుమ మ్యాచ్‌లు


పీటీసీలో క్రీడాకారుల వాగ్వాదం

అనంతపురం క్లాక్‌టవర్, ఫిబ్రవరి 2: ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడా పోటీలు గందరగోళంగా మారాయి. నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో శుక్రవారం పురుషుల విభాగంలో కబడ్డీ, ఖో-ఖో, వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఆర్డీటీ స్టేడియంలో క్రికెట్, అశోక్‌నగర్‌లోని డీఎస్‌ఏ ఇండోర్‌స్టేడియంలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించారు. పీటీసీలో నిర్వహించిన కబడ్డీ పోటీలలో చియ్యేడు, ఎస్‌ఎస్‌బీఎన్ జట్లు తలపడ్డాయి. ఎస్‌ఎస్‌బీఎన్ జట్టు తరపున కర్నూలుకు చెందిన క్రీడాకారులు ఉండడంతో చియ్యేడు జట్టు సభ్యులు అభ్యంతరం తెలిపారు. దీంతో వాగ్వాదం జరిగింది. డీఎస్‌డీఓ నరసింహారెడ్డి అక్కడికి చేరుకుని క్రీడాకారుల మధ్య వాగ్వాదాన్ని వారించి మ్యాచ్‌లు సక్రమంగా జరిగేలా చూశారు. పోలీసు బందోబస్తు నడుమ పోటీలు సాగడం గమనార్హం. ఉన్నతాధికారులు, క్రీడా శాఖ అధికారుల మధ్య సమన్వయ లోపంతో జనవరి 31, ఫిబ్రవరి 1న నిర్వహించాల్సిన జిల్లా స్థాయి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు ఒక రోజు ఆలస్యంగా జరుగుతున్నాయి. దీంతో క్రీడాకారులు నానా అవస్థలు పడాల్సి వచ్చింది.


బందోబస్తుకు వచ్చిన పోలీసులు

కొత్త తహసీల్దార్లకు పోస్టింగ్

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 2: ఎన్నికల నిబంధనల మేరకు జిల్లాకు బదిలీపై వచ్చిన కొత్త తహసీల్దార్లకు పోస్టింగ్‌లు ఇచ్చారు. ఉమ్మడి జిల్లాకు 55 మంది తహసీల్దార్లు ఇతర జిల్లాల నుంచి వచ్చారు. అందులో అనంతపురం జిల్లాకొచ్చిన 39మందికి కలెక్టరు గౌతమి పోస్టింగ్ ఉత్తర్వులు ఇచ్చారు.

తహసీల్దార్ పేరు	కేటాయించిన స్థానం
పద్మావతమ్మ	అనంతపురం ఆర్డీఓ ఆఫీస్
సుధాకరరావు	కళ్యాణదుర్గం
రామాంజినమ్మ	బొమ్మనహాళ్
టీజీ మోహన్‌వలి	యాడికి
టీ.శ్రీనాథ్	రాప్తాడు
జీఎం. కుమార్‌స్వామి	పెద్దపప్పూరు
వై. చిట్టిబాబు	రాయదుర్గం
బీ. హనుమంతు	కుందుర్పి
డీ. రవికుమార్	కలెక్టరేట్
డీ. లక్ష్మీనారాయణ	నార్పల
ఎం.హనుమంతునాయక్	బుక్కరాయసముద్రం
జే. నిత్యానందబాబు	కంబదూరు
సీ. శ్రీదేవి	శెట్టూరు
టీ.వీ.సుబ్రహ్మణ్యం	అనంతపురంరూరల్
జే. పరమేశ్వరస్వామి	ఆత్మకూరు
యు. దస్తగిరయ్య	విడపనకల్లు
ఎం. లోకేశ్వరి	గార్లదిన్నె
సీ.కే.శ్రీనివాసులు	ఉరవకొండ
హెచ్. హరినాథ్‌రావు	బెళుగుప్ప
మురహరి జయప్రసాద్	యల్లనూరు
బీ. భారతి	గుత్తి
వి. చంద్రానాయక్	పామిడి
జీ. రత్నారాధిక	కూడేరు
ఎస్. మహమ్మద్‌రఫీ	వజ్రకరూరు
యానంది వెంకటేశ్వర్లు	ల్యాండ్ రీఫామ్స్ అనంతపురం
అల్లూరు శేషఫణి	గుంతకల్లు
కొంగటి కుమారస్వామి	పెద్దవడుగూరు
కె. మల్లికార్జునస్వామి	పుట్లూరు
సతీష్	కలెక్టరేట్
కె. ఆంజనేయులు	తాడిపత్రి
ఎస్. శ్రీనాథ్	కలెక్టరేట్
కె. విజయకుమార్	కలెక్టరేట్
టీ. ఈశ్వరయ్య	బ్రహ్మసముద్రం
ఆర్. శేషరాంసింగ్	కలెక్టరేట్
ఎం. ఇందిరారాణి	కణేకల్లు
కె. శోభన్‌బాబు	శింగనమల
జీ. వెంకటేశ్వర్లు	గుమ్మఘట్ట
బీ. శివరామిరెడ్డి	అనంతపురం అర్బన్
బీ. బాల ఈశ్వరరెడ్డి	డి.హీరేహాళ్

సహజీవనం చేసి మోసం చేశాడు


- ఏఆర్ ఎస్‌ఐ చంద్రశేఖర్‌పై మహిళ ఆరోపణ
- ఎస్పీ కార్యాలయం ఎదుట నిరసన


మీడియాతో మాట్లాడుతున్న అంజలి

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2: ఏపీఎస్పీలో పని చేస్తున్న ఏఆర్ ఎస్‌ఐ చంద్రశేఖర్ తనతో సహజీవనం చేసి మోసం చేశాడని అనంతపురం నగరానికి చెందిన అంజలి పేర్కొన్నారు. ఎస్పీ కార్యాలయం ఎదుట శుక్రవారం ఆమె తన కుమారుడితో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ 2008లో తన భర్త కానిస్టేబుల్ ఇమాంసాబ్ పీటీసీకి శిక్షణ కోసం వచ్చిన సందర్భంలో ఏఆర్ ఎస్‌ఐగా పనిచేస్తున్న చంద్రశేఖర్ తన భర్తతో స్నేహం చేశాడన్నారు. ఆ క్రమంలో తరచూ తమ ఇంటి కి వచ్చేవాడని వెల్లడించారు. నీ భర్త శిక్షణ పూర్తయిన తరువాత ఎగ్జామ్ రాస్తాడని, ఆ పేపర్లు కనబడకుండా చేస్తానని తనను భయపెట్టి లొంగదీసుకున్నాడని ఆరోపించారు. ఈక్రమంలోనే భర్త తనకు దూరమయ్యాడన్నారు. 2009లో తమకు కుమారుడు పుట్టాడన్నారు. ఇలా ఇన్ని రోజులూ కాపురం చేసి ఇప్పుడు తన భార్యా పిల్లలకు ఈ విషయం తెలిసిందని చెప్పి తప్పించుకుంటున్నాడని, వారితో తమను తిట్టించాడని వాపోయారు. వారు తమను చంపుతామని, నడిరోడ్డులో ఉరేస్తామని బెదిరిస్తున్నారని అంజలి ఆరోపించారు. నీ భర్తకు స్లోపాయిజన్ ఇచ్చానని, నీ భర్త ఎక్కడో దూరంగా వెళ్లి చనిపోయాడని చంద్రశేఖర్ చెబుతున్నాడని తెలిపారు. ఆధార్‌కార్డులో తన పేరు తొలగించకపోతే చంపేస్తానని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. తాజాగా స్కూల్ ఫీజు కడతానని చెప్పి నగరంలోని ఓ లాడ్జిలోకి పిలిపించి చిత్రహింసలు పెట్టాడని ఆమె పేర్కొన్నారు. ఆధార్‌కార్డులో తన పేరు శ్రీనివాసులు అని చెప్పి సృష్టించాడని తెలిపింది. గొడవల నేపథ్యంలో అప్పటి డీఎస్పీ ఎ.శ్రీనివాసులుకు సమస్య విన్నవిస్తే త్రీటౌన్ సీఐ కత్తి శ్రీనివాసులుకు రెఫర్ చేశారని, కానీ ఆ సీఐ కేసు కట్టనని చెప్పి వెనక్కు పంపారని తెలిపారు. ఆ తరువాత సీఐ ధరణికిషోర్‌ను విచారించమని చెప్పగా...చంద్రశేఖర్ వచ్చి రూ.16లక్షల డబ్బు, మూడు సెంట్ల స్థలమిస్తానని చెప్పి డీఎల్‌ఎస్‌లో క్లియర్ చేసుకుంటానని చెప్పాడన్నారు. ఆధార్‌కార్డులో తన పేరు తొలగిస్తే ఆ డబ్బు ఇస్తానని చెప్పాడన్నారు. అయితే సీఐ ధరణికిషోర్, చంద్రశేఖర్ ఏం మాట్లాడుకున్నారో తెలియదు కానీ సీఐ వచ్చి ఆధార్ కార్డులో పేరు మార్చమని చెప్పారన్నారు. ఆ తరువాత న్యాయవాది సమక్షంలో ఆధార్‌కార్డులో పేరు మార్చగానే ఎస్‌ఐ చంద్రశేఖర్ మాట మార్చారన్నారు. నీ భర్తను చంపినట్లే.. మిమ్మల్ని చంపుతానని బెదిరిస్తున్నాడని ఆరోపించారు. చంద్రశేఖర్ భార్య సూర్యకుమారి, కుమార్తె తేజశ్విని, కొడుకు సాయికిరణ్ తనను చంపేస్తారని ఆందోళన వ్యక్తం చేశారు. పోలీస్ అధికారులకు ఎన్ని మార్లు ఫిర్యాదు చేసినా తనకు ఎక్కడా న్యాయం జరగలేదని వాపోయారు. న్యాయం చేస్తామని చెప్పి ఎస్పీ కార్యాలయ వర్గాలు ఆమె సర్దిచెప్పి పంపారు.

గ, హో.. ఓటర్లే !

- ఓటరు తుది జాబితాలో చిత్ర విచిత్రాలు
- చనిపోయిన వారి పేర్లు తొలగించని వైనం


సీరియల్ నెంబర్ 489 గ అనే పేరుతో నమోదైన ఓటు


సీరియల్ నెంబర్ 380లో మృతి చెందిన క్రిష్టయ్య ఓటు

బత్తలపల్లి, ఫిబ్రవరి 2: ఓటరు తుది జాబితాలో చిత్రవిచిత్రాలు చోటు చేసుకున్నాయి. ఏ గ్రామంలోని ఓటరు జాబితా పరిశీలించినా తప్పులే కనిపిస్తున్నాయి. బత్తలపల్లిలోని జాబితాలో 106 పోలింగ్ కేంద్రంలో సీరియల్ నెంబర్ 489లో గ అని, సీరియల్ నెంబర్474లో హో అనే పేర్లు జాబితాలో ఉన్నాయి. సీరియల్ నెంబర్ 105, 110లో బిల్లే విజయ పేరు మీద రెండు ఓట్లు ఉన్నాయి. 55, 84లో షేక్ షరీఫ్ పేరు మీద రెండు ఓట్లు ఉన్నాయి. సీరియల్ నెంబర్ 191, 668, గోపాల్ అచారి కమ్మర పేరు మీద రెండు ఓట్లు ఉన్నాయి. సీరియల్ నెంబర్ 380 కిష్టయ్య మృతి చెందాడు. సీరియల్ నెంబర్ 265 రామప్ప మృతి చెందాడు. అయినా వారి పేర్లు తొలగించలేదు. వెంకటగారిపల్లి గ్రామంలో కేంద్రం 98లో సీరియల్ నెంబర్ 1, 129, 130, 131, 132లో గ్రామంలో లేని వారి పేర్ల మీద నకిలీ ఓట్లు ఉన్నాయని బీఎల్‌ఓలకు ఎన్నిసార్లు చెప్పినా వాటిని తొలగించలేదని టీడీపీ నాయకులు ఆరోపిస్తున్నారు.

ఎన్నికల విధులపై నిర్లక్ష్యం వద్దు

- రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి ముఖేష్‌కుమార్ మీనా
- తుది ఓటరు జాబితాలో తప్పులపై అసంతృప్తి
- చేర్పులు, తొలగింపులపై నిత్యం మానిటరింగ్ చేయాలని ఆదేశం


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టరు, జేసీ తదితరులు

అనంతపురం టౌన్, ఫిబ్రవరి 2: ఎన్నికల విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని, ఎవరు తప్పు చేసినా చర్యలు తప్పవని రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా జిల్లా అధికారులను హెచ్చరించారు. జిల్లా అధికారులతో శుక్రవారం ఆయన ఎన్నికల నిర్వహణ, ఓటరు జాబితాలో తప్పులు, పరిశీలన, పోలింగ్ కేంద్రాలు, ఎన్నికల సిబ్బంది నియామకాలు తదితర వాటిపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. కలెక్టరేట్‌లో కలెక్టరు గౌతమి, జాయింట్ కలెక్టరు కేతన్‌గార్గ్, డీఆర్‌ఓ గాయిత్రీదేవితోపాటు ఆర్డీఓలు, ఈఆర్‌ఓలు పాల్గొన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రధానాధికారి ముఖేష్ కుమార్ మీనా మాట్లాడుతూ ఎన్నికల నిబంధనల ప్రకారం ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. ఎన్నికలు ఎపుడు వచ్చినా నిర్వహణకు అందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు తుది జాబితాలో తప్పుల పట్ల ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. తాజాగా వస్తున్న ఆరోపణలు, అభ్యంతరాలు, ఫిర్యాదుల విషయంలో నిర్లక్ష్యం చేయవద్దన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, తొలగింపుల పై నిరంతరం మానటరింగ్ చేయాలన్నారు. అందుకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు పంపాలని ఆదేశించారు. పెండింగ్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించాలని సూచించారు. ఈఆర్‌ఓలు, ఏఈఆర్‌ఓలు, నోడల్ అధికారులు ఎన్నికల నిబంధనలకు లోబడే పనిచేయాలని అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తే తగిన మూల్యం చెల్లించు కుంటారని హెచ్చరించారు.

ఎన్నికల నిర్వహణకు పక్కాగా చర్యలు: కలెక్టరు

సాధారణ అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు పక్కాగా చర్యలు చేపడుతున్నట్లు కలెక్టరు గౌతమి ఎన్నికల కమిషన్ సీఈఓకు వివరించారు. పెండింగ్ ఫిర్యాదులను త్వరగా పరిష్కారానికి చూస్తున్నామన్నారు. ఓటర్ల జాబితాలో తప్పులు, చేర్పులు, తొలగింపులపై ప్రత్యేక దృష్టి పెట్టి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఎన్నికల నిర్వహణకు సిబ్బందిని నియమించామని ఇప్పటికే సెక్టోరియల్ అధికారులు, ఏఎల్ఎంటీలకు తొలివిడత శిక్షణ పూర్తి చేశామని రెండోవిడత శిక్షణ వచ్చేవారంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. పోలింగ్‌సిబ్బందిని గుర్తించామని, పోలింగ్‌కేంద్రాలలో వసతులు కల్పిస్తున్నామన్నారు. అక్రమంగా జిల్లాలోకి మద్యం, డబ్బు రాకుండా చేసేందుకు చెక్‌పోస్టులు ఏర్పాటుచేసి నిఘా ఉంచినట్లు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓలు గ్రంధివెంకటేష్, రాణిసుష్మిత, శీనివాసులురెడ్డి, ఈఆర్‌ఓలు వెంకటేశ్వర్లు, కరుణకుమారి, వెంకటనారాయణమ్మ, వరప్రసాద్, డిప్యూటీ కలెక్టర్ విశ్వనాథ్,డీఐఓ రవిశంకర్, ఎన్నికల సెల్ అధికారులు, డీటీలు పాల్గొన్నారు.

ఎస్‌జీటీ ఖాళీలు నాలుగేనట..!

- సోషల్ మీడియాలో వైరల్... డీఎస్సీ ఖాళీలపై మొదలైన కసరత్తు
- నేడు విజయవాడకు జిల్లా విద్యాశాఖాధికారులు

అనంతపురం విద్య, ఫిబ్రవరి 2: నిరుద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్న ఉపాధ్యాయ డీఎస్సీపై కదలిక మొదలైంది. నాలుగున్నరేళ్లుగా ఊరించిన రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు డీఎస్సీ నోటిఫికేషన్‌పై కసరత్తు ప్రారంభించింది. డీఎస్సీ పోస్టుల ఖాళీలపై శుక్రవారం సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ఎస్‌జీటీ పోస్టులు 4, స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ -1 11 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ లాంగ్వేజ్ -2 27 పోస్టులు, స్కూల్ అసిస్టెంట్ ఇంగ్లిష్ 53, గణితం 21, ఫిజికల్ సైన్స్ 12, బయాలజీ 6, సోషల్ స్టడీస్ 5, స్కూల్ అసిస్టెంట్ (ఫిజికల్ ఎడ్యుకేషన్) 56 ఖాళీలు ఉండే అవకాశం ఉందంటూ...సోషల్ మీడియాలో ఉపాధ్యాయ పోస్టుల వివరాలు వైరల్‌గా మారాయి. అయితే జిల్లా విద్యాశాఖాధికారులు వాటిని ధ్రువీకరించడం లేదు.

- జిల్లా విద్యాశాఖాధికారులకు విజయవాడ నుంచి పిలుపు వచ్చింది. శనివారం రాష్ట్ర విద్యాశాఖ కార్యాలయానికి వెళ్లనున్నారు. ఒక అసిస్టెంట్ డైరెక్టర్, ఒక సూపరింటెండెంట్, ఒక క్లర్క్‌ను ఖాళీలపై సమావేశంలో పాల్గొనడానికి విజయవాడకు రావాలంటూ.. పై నుంచి ఆదేశాలు వచ్చాయి. డీఎస్సీ ఖాళీలపై 4 లేదా 5వతేదీ స్పష్టత వచ్చే అవకాశం ఉందని జిల్లా విద్యాశాఖ వర్గాలు తెలిపాయి.

గవర్నర్‌ను కలిసిన వీసీలు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 2: రాష్ట్ర గవర్నర్‌ను జేఎన్‌టీయూ, ఎస్కేయూ వీసీలు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. రాష్ట్ర వర్సిటీల వీసీలకు విజయవాడలో ఉన్నత విద్యాశాఖ ఆధ్వర్యంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వెళ్లిన జేఎన్‌టీయూ వీసీ శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ శశిధర్, ఎస్కేయూ వీసీ హుస్సేన్‌రెడ్డి, రిజిస్ట్రార్ ఎంవీ లక్ష్మయ్య గవర్నర్‌ను కలిశారు.

ఆరోగ్యంపై దృష్టి సారించండి: ఎస్పీ



గౌరవవందనం స్వీకరిస్తున్న ఎస్పీ అన్బురాజన్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2: 'ఆరోగ్యంగా ఉంటేనే ఏదైనా చేయగలుగుతాం. విధులతో పాటు ఆరోగ్యంపైనా దృష్టి సారించాలి' అని జిల్లా ఎస్పీ అన్బురాజన్ తన సిబ్బందికి సూచించారు. జిల్లా సాయుధ పోలీసు బలగాలకు రెండు వారాల పాటు నిర్వహించిన డీ మొబలైజేషన్ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. స్థానిక పోలీసు పరేడ్ మైదానంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఏఆర్ ప్లటూన్లను పరిశీలించిన అనంతరం ఎస్పీ మాట్లాడుతూ మంచి ఆహారం వేళకు తీసుకోవాలని, యోగాసనాలు, ఎక్సర్‌సైజులు క్రమం తప్పకుండా చేయాలన్నారు. ఉద్యోగంతో పాటు కుటుంబానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, హనుమంతు, డీఎస్పీలు శ్రీనివాసులు, సీఎం గంగయ్య, టీవీ శివారెడ్డి, మునిరాజా, పలువురు సీఐలు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఏపీ టీచర్స్ జేఏసీ కార్యవర్గం ఎంపిక

అనంతపురం విద్య, ఫిబ్రవరి 2: ఏపీ టీచర్స్ జేఏసీ ఉమ్మడి జిల్లా కొత్త కార్యవర్గాన్ని రాష్ట్ర కార్యవర్గం ఎంపిక చేసినట్లు ఆ సంఘం జిల్లా చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి అనంతపురం జిల్లా చైర్మన్‌గా తనను, జనరల్ సెక్రెటరీగా ప్రభాకర్‌ను, డిప్యూటీ జనరల్ సెక్రెటరీలుగా నాగిరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, ట్రెజరర్‌గా పుల్లారెడ్డి, కో చైర్మన్లుగా ఓబిరెడ్డి, క్రిష్ణ ప్రసాద్, లస్కర్ నాయక్, యల్లప్ప, వైస్ చైర్మన్లుగా గోపాల్, గోపాల్‌రెడ్డి, కవిత, బాబయ్యను ఎంపిక చేశారన్నారు. సెక్రెటరీలుగా వెంకటరమణప్ప, ప్రసాద్‌రెడ్డి, క్రిష్ణకుమార్, నాగేంద్ర గౌడ్, పబ్లిసిటీ సెక్రెటరీగా శివారెడ్డిని రాష్ట్ర కమిటీ ఎంపిక చేసిందన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఉద్యోగులకు మధ్యంతరభృతి, 2003 డీఎస్సీ టీచర్లకు ఓపీఎస్ పునరుద్ధరణ తదితర అంశాలపై పోరాటం చేస్తామని పేర్కొన్నారు.



అనంతపురం డీఎస్పీ ప్రసాద్‌రెడ్డిని సన్మానిస్తున్న పోలీస్ అధికారులు

ఉద్యోగులకు ఆత్మీయ వీడ్కోలు

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2: బదిలీపై వెళ్తున్న, ఉద్యోగ విరమణ చేసిన అధికారులకు స్థానిక పోలీస్ కాన్ఫరెన్స్ హాలులో ఎస్పీ అన్బురాజన్ ఆత్మీయ వీడ్కోలు సభను శుక్రవారం నిర్వహించారు. జిల్లా నుంచి ఒక ఏఆర్ అదనపు ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, నలుగురు ఆర్ఎస్ఐలు బదిలీ కాగా, డీపీఓ సూపరింటెండెంటు, గుంతకల్లు వన్‌టౌన్ ఏఎస్ఐ ఉద్యోగ విరమణ చేశారు. వారిని ఎస్పీ సన్మానించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీలు విజయభాస్కర్‌రెడ్డి, రామకృష్ణ, హనుమంతు, డీఎస్పీలు శ్రీనివాసులు, సీఎం గంగయ్య, నరసింగప్ప, బీవీ శివారెడ్డి, మునిరాజా, ఎస్బీ సీఐలు జాకీర్‌హుస్సేన్, ఇందిర, పీసీఆర్ సీఐ దేవానంద్, ఆర్ఐలు హరికృష్ణ, రాముడు, జిల్లా పోలీస్ అధికారుల సంఘం అడహక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, సుధాకర్‌రెడ్డి, హరినాథ్, తేజ్‌పాల్, నాగరాజు, ఆర్ఎస్ఐలు బాలాజీనాయక్, ప్రవీణ్‌కుమార్, మగ్బుల్, రమేష్ నాయక్, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

వంక స్థలం ఆక్రమణపై ఆరా



అధికార పార్టీ నాయకులు చదును చేసిన భూమి

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 2: మండలంలోని కురుగుంట గ్రామ సర్వే నెంబరు 98-3లో వంక స్థలం ఆక్రమణపై ఇరిగేషన్ అధికారులు ఆరా తీసినట్లు తెలుస్తోంది. సంబంధిత అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించినట్లు సమాచారం. కాగా, ప్రభుత్వం భూములు పరిరక్షించాల్సిన రెవెన్యూ అధికారులు నేటికీ అటు వైపు తొంగిచూడకపోవడం విమర్శలకు తావిస్తోంది. అధికార పార్టీ నాయకులు ఆ వంకను చదును చేయడంతో వారికి ఆ అధికారులు కొమ్ము కాస్తున్నారే ఆరోపణలూ లేకపోలేదు. దీనిపై ఆంధ్రజ్యోతిలో కథనం రావడంతో స్పందించిన ఇరిగేషన్ అధికారులు ఆ వంకను పరిశీలించేందుకు రెవెన్యూ అధికారులను సంప్రదించినట్లు తెలిసింది. అయినా రెవెన్యూ అధికారులు ఏ ఒక్కరూ పెద్దగా స్పందించలేదు. ఓ ఇరిగేషన్ అధికారి పలుమార్లు వీఆర్వో, గ్రామ సర్వేయర్‌కు ఫోన్ చేసినా వారు స్పందించలేదనే ఆరోపణలున్నాయి. చివరకు ఆ గ్రామ వీఆర్ఏ ఆ ఇరిగేషన్ అధికారికి చదును చేసిన ఆ వంక స్థలాన్ని దూరం నుంచి చూపించినట్లు సమాచారం. వారి స్వామిభక్తికి చేసేదేమీలేక ఆ ఇరిగేషన్ అధికారి వెనుతిరిగినట్లు తెలిసింది.

పవర్ టిల్లర్ యంత్రాలపై సమీక్ష



పవర్ టిల్లర్ యంత్రాలపై సమీక్షిస్తున్న కంపెనీ ప్రతినిధులు

గార్లదిన్నె, ఫిబ్రవరి 2: గార్లదిన్నె సమీపంలోని దక్షిణ క్షేత్ర వ్యవసాయ యంత్రముల శిక్షణ, పరీక్షన సంస్థ (ట్రాక్టర్ నగర్)లో పవర్ టిల్లర్ యంత్రాలపై శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఆ సంస్థ డైరెక్టర్ డాక్టర్ బాలాజీ మూరారీ నాందెడే అధ్యక్షతను నిర్వహించిన ఈ సమీక్షకు ముఖ్య అతిథులుగా ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసర్చ్ డాక్టర్ కేఎస్ ఆగర్వాల్, బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్ సైంటిస్ట్ డాక్టర్ విక్రాంత్‌చౌహన్, పవర్ టిల్లర్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా డాక్టర్ సురేందర్‌సింగ్, ఇండియన్ కౌన్సిల్ ఫర్ అగ్రికల్చర్ రీసర్చ్ అధికారి, పవర్ టిల్లర్స్ అసోషియేషన్ ఆఫ్ ఇండియా ప్రతినిధులు, వపర్ టిల్లర్ తయారీ ప్రతినిధులు హాజరయ్యారు. బాలాజీ మూరారీ నాందెడే మాట్లాడుతూ.. దేశంలో పంటలు, వ్యవసాయ పద్ధతులకు అనుగుణంగా యంత్రాలను తయారుచేస్తున్నామని, అలాగే నూతన సాంకేతికత మార్పులకు తగిన సలహాలు స్వీకరిస్తున్నామని తెలిపారు. సమావేశంలో పవర్ టిల్లర్ కంపెనీ ప్రతినిధులు, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కారు చోరీ కేసు దర్యాప్తులో వెలుగుచూసిన హత్య



మాట్లాడుతున్న డీఎస్పీ

చంద్రగిరి, ఫిబ్రవరి 2: చంద్రగిరి పోలీసులు కారు చోరీ కేసు దర్యాప్తు చేస్తుండగా.. ఎనిమిది నెలల క్రితం జరిగిన ఓ మహిళ హత్య కేసు వెలుగు చూసింది. నిందితులను అరెస్ట్ చేశారు. శుక్రవారం తిరుపతి జిల్లా చంద్రగిరిలో డీఎస్పీ యశ్వంత్ కేసు తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రికి చెందిన గ్రానైట్ వ్యాపారి నరేంద్రనాథరెడ్డితో అనంతపురానికి చెందిన జయమ్మ(35) సహజీవనం చేస్తుండేది. వీరికి ఒక కుమారుడు పుట్టాడు. తరువాత నరేంద్రనాథ్‌రెడ్డి మరో వివాహం చేసుకుని చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లె వద్ద దున్నలు, పొట్టేళ్లు, నాటు కోళ్ళ ఫామ్ పెట్టి స్థిరపడ్డాడు. జయమ్మకు పుట్టిన శరణ్‌కుమార్‌రెడ్డిని నరేంద్రనాథ రెడ్డి తన వద్దే ఉంచుకున్నాడు. దీంతో జయమ్మ అపుడప్పుడూ బుచ్చినాయుడుపల్లెకు వచ్చి నరేంద్రనాథరెడ్డి తనను మోసం చేశాడని, తన బిడ్డను కూడా దూరం చేశాడని గొడవ పెట్టుకునేది. ఈ నేపథ్యంలో గత సంవత్సరం మే 25వ తేదీన నరేంద్రనాథరెడ్డిని ఫారం వద్దకు వచ్చిన జయమ్మ నిలదీస్తుండగా అతడి వద్ద పనిచేస్తున్న ఓబులేశు పికాసితో ఆమె తలపై కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అదేరోజు రాత్రి జయమ్మ మృతదేహాన్ని నరేంద్రనాథరెడ్డి తన కారులో వేసుకుని ఓబులేశు, తన వద్ద పనిచేసే అప్పారావు, రఘుపతిరాజులతో కలిసి అన్నమయ్య జిల్లా రాజంపేట వద్ద చెయ్యూరు చెరువు వంకలో పూడ్చిపెట్టారు. కాగా జయమ్మ కనిపించడంలేదంటూ ఆమె సోదరుడు దేవేంద్ర అనంతపురం నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జయమ్మను హత్య చేసినందుకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఇస్తానని నరేంద్రనాథరెడ్డి హామీ ఇచ్చాడు. అయితే డబ్బులు ఇవ్వకపోవడంతో అప్పారావు ఇటీవల అతని కారు చోరీ చేశాడు. పది రోజుల క్రితం నరేంద్రనాథరెడ్డి తన కారు చోరీ అయిందని చంద్రగిరి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కారు చోరీ చేసిన అప్పారావును పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. దీంతో జయమ్మ హత్య వెలుగులోకి వచ్చింది. అప్పారావు ఇచ్చిన సమాచారం మేరకు చంద్రగిరి పోలీసులు శుక్రవారం కళ్యాణి డ్యామ్ వద్ద నరేంద్రనాథరెడ్డి, ఓబులేశులను అరెస్ట్ చేశారు. రఘుపతిరాజు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ యశ్వంత్ తెలిపారు.

అర్హులకు అందని సంక్షేమ పథకాలు

మాజీ మంత్రి పరిటాల సునీత



ఆర్ఎన్ఆర్ కాలనీలో కరపత్రాలు పంపిణీ చేస్తున్న పరిటాల సునీత

అనంతపురంరూరల్, ఫిబ్రవరి 2: వైసీపీ పాలనలో అనేక మంది అర్హులకు సంక్షేమ పథకాలు అందలేదని మాజీ మంత్రి పరిటాల సునీత మండిపడ్డారు. అందరి సంక్షేమం ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని ఆమె స్పష్టం చేశారు. శుక్రవారం మండలంలోని రాచానపల్లి పంచాయతీ ఆర్ ఎన్ఆర్ కాలనీ, సిండికేట్ నగర్‌ల్లో బాబు ష్యూరిటీ- భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఆమె నిర్వహించారు. స్థానిక నాయకులతో కలసి ఇంటింటికి తిరుగుతూ.. మేనిఫెస్టో కర పత్రాలు పంపిణీ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో కొంతమందికి మాత్రమే సంక్షే మ పథకాలు అందించి అందరికీ లబ్ధిచేసి నట్లు ప్రచారం చేసుకుంటున్నారని విమర్శిం చారు. సీఎం జగన్ రైతులకు బీమా, మహిళలకు ఆసరా పంపిణీ పేరుతో జిల్లాకు వచ్చి బటన్ నొక్కివెళ్లారని, అయితే చాలా మందికి డబ్బులు పడలేదని అన్నారు. పైకి మాత్రం అందరికీ డబ్బులు వేసున్నట్లు ప్రచారం చేసుకుంటున్నారన్నారు. ఇలాంటి మోసపూరిత మాటలతో ఇంకా ఎన్నిరోజులు ప్రజలను మభ్యపెడతారని ప్రశ్నించారు. మరో రెండు నెలల్లో ఎన్నికలు రాబోతున్నా యని, ప్రతి ఇక్కరూ ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచించారు. వచ్చే ఎన్నికల్లో వైసీపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. కార్యక్ర మంలో మండల కన్వీనర్ జింకా సూర్య నారాయణ, మాజీ జడ్పీటీసీ వేణుగోపాల్, మండల ప్రధాన కార్యదర్శి పాముదాయి రఘు, ఎంపీటీసీ కృష్ణరెడ్డి, మాజీ ఎంపీటీసీ సర్దానప్ప, గ్రామకమిటీ అధ్యక్షుడు మంజునాథ్, నాయకులు అల్లీ పీరా, ఓబుళపతి, బిల్లా నాగరాజు, సాకే వీరా, బుల్లెట్ రఫీ, నారాయణస్వామి, లింగమయ్య పాల్గొన్నారు.

వైసీపీ నుంచి టీడీపీలోకి...

రామగిరి మండలం పెద్దకొండాపురం పంచాయతీ మాజీ సర్పంచు కుప్పిరెడ్డి కుమారుడు రామచంద్రారెడ్డి వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. శుక్రవారం రాత్రి మండలంలోని రాచానపల్లి పంచాయతీలో నిర్వహించిన బాబుష్యూరిటీ-భవిష్యత్తు గ్యారెంటీ కార్యక్రమంలో పరిటాల సునీత సమక్షంలో ఆయన పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాగ భూషణం, ఎర్రబొమ్మయ్య, రవిచంద్ర, రామగిరి మండల కన్వీనర్ సుధాకర్ పాల్గొన్నారు.

ప్రదర్శన తీరు మెరుగుపడాలి

జేఎన్‌టీయూ అధికారులకు న్యాక్ పీర్ కమిటీ సూచన



స్టాల్స్ పరిశీలిస్తున్న సభ్యులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 2: విద్య, పరిశోధన, ల్యాబ్‌లు, ఫ్యాకల్టీ ప్రొఫైల్స్ ఇలా అన్ని అంశాల్లోనూ ప్రదర్శన తీరు ఇంకా మెరుగు పరుచుకోవాలని న్యాక్ మాక్ పీర్ కమిటీ సభ్యులు.. జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల అధికారులకు సూచించారు. శుక్రవారం న్యాక్ ఎక్స్‌పర్ట్ టీమ్ సభ్యులు జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలను మాక్ ఆడిట్ నిర్వహించారు. కళాశాలకు చేరుకున్న కమిటీ సభ్యులు ఎమెరిట్స్ ప్రొఫెసర్ త్యాగరాజన్, గాంధీరామ్ రూరల్ ఇన్స్టిట్యూట్ ప్రొఫెసర్ సేతూరామ్, అన్న యూనివర్సిటీ ప్రొఫెసర్ ముత్తాన్ జేఎన్‌టీయూ రెక్టార్ విజయ కుమార్‌తో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించిన సభ్యులు.. మూడు బృందాలుగా వీడిపోయి కళాశాలలోని పలు విభాగాలను పరిశీలిం చారు. ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్, స్టాల్స్ ప్రదర్శన తో పాటు సాంస్కృతిక కార్యక్రమాలను అర్థవంతమైన రీతిలో ఏర్పాటు చేయాల న్నా రు. శనివారం ఎంబీఏ, కంప్యూటర్ సైన్స్ విభాగాలతోపాటు ఓటీపీఆర్ఐను పరిశీలిస్తారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ అరుణ కాంతి, విభాగాల అధిపతులు భారతి, మమత, కళ్యాణిరాధ, భువన విజయ, దిలీప్‌కుమార్, మారాల రామశేఖర్‌రెడ్డి, ఫ్యాకల్టీ సుద ర్శన రావు, భానుమూర్తి, గోర్పాడే, భవాని, కేబీ చంద్రశేఖర్, దేవన్న, ఓంప్రకాష్ పాల్గొన్నారు.

'సంసిద్ధ్'పై కేసులు నమోదు చేయాలి

అనంతపురం విద్య, ఫిబ్రవరి 2: స్కూల్‌ను బార్‌లా మార్చిన సంసిద్ధ్ యాజమాన్యంపై కేసులు నమోదు చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం ఏఐఎస్ఎఫ్, ఎస్ఎఫ్ఐ నాయకులు అంబేద్కర్ విగ్రహం వద్ద అర్ధనగ్న ప్రదర్శన చేస్తూ నిరసన తెలిపారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రమణయ్య, జిల్లా ప్రధాన కార్యదర్శి కుల్లాయిస్వామి, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి పరమేష్ మాట్లాడుతూ... సంసిద్ధ్ స్కూల్‌లో మద్యం వివాదం బయటపడి వారం రోజులు గడుస్తున్నా... విద్యాశాఖ అధికారులు ఎలాంటి చర్యలూ తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా కలెక్టర్, ఆర్‌జేడీ తక్షణమే ఆ స్కూల్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని, ప్రిన్సిపాల్, యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు ఉమామహేష్‌వంశీ, మంజునాథ్, రారాజు, హరికృష్ణ, విశ్వనాథ్, ఎస్ఎఫ్ఐ నాయకులు సిద్ధు గిరి, భీమేష్, సొము పాల్గొన్నారు.

ఉద్యానశాఖ ఏడీకి ఉద్యోగోన్నతి!

అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 2: ఉద్యానశాఖ ఏడీ రఘునాథ్‌రెడ్డి ఉద్యోగోన్నతి కల్పిస్తూ రెండు రోజుల్లో అధికారికంగా ఉత్తర్వులు జారీ అయ్యే అవకాశముంది. ప్రస్తుతం ఆయన ఉద్యానశాఖ ఇన్‌చార్జి డీడీగా పనిచేస్తున్నారు. ఉద్యోగోన్నతిపై అయన్ను ఉద్యానశాఖ రెగ్యులర్ డీడీ లేదా ఏపీఎంఐపీ పీడీగా నియమించే అవకాశం ఉన్నట్లు సమాచారం.

కమిషనర్‌ను కలిసిన అడిషనల్ కమిషనర్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2: నగరపాలిక నూతన అడిషనల్ కమిషనర్ శ్రీహరిబాబు నగర కమిషనర్ మేఘ స్వరూప్‌ను కలిశారు. ఇక్కడి కమిషనర్ రమణారెడ్డి బదిలీ నేపథ్యంలో నెల్లూరు జిల్లా గూడూరు కమిషనర్‌గా ఉన్న శ్రీహరిబాబును నగరపాలిక అడిషనల్ కమిషనర్‌గా నియమించిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో శుక్రవారం కార్పొరేషన్‌కు వచ్చిన ఆయన కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కాగా డిప్యూటీ కమిషనర్ సావిత్రి రిలీవ్ అయ్యారు.

శింగనమల ఎంపీడీవోగా రమణ

శింగనమల, ఫిబ్రవరి 2: శింగనమల ఎంపీడీవోగా బీవీ రమణ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పనిచేసిన నిర్మలాకుమారి కడప జిల్లాలకు బదిలీకాగా ఆమె స్థానంలో కర్నూల్ నుంచి బీవీ రమణ బదిలీపై ఇక్కడికి వచ్చారు.

సీపీఐ గ్రామ కమిటీల ఏర్పాటు: మండలంలోని కల్లుమడి, తరిమెల గ్రామ సీపీఐ నూతన కమిటీలను శుక్రవారం ఏర్పాటు చేసినట్లు నియోజకవర్గం ఆ పార్టీ కార్యదర్శి నారాయణస్వామి తెలిపారు. కార్యక్రమంలో నేసేమధు, దుబ్బన్న, దైవయత్నం, రామ సుబ్బారెడ్డి మాసూద్‌వలి, ఆచారి, సుంకన్న పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

కళ్యాణదుర్గం : ఒంటరి జీవితం భరించలేక మండలంలోని ఎర్రబోరేపల్లి గ్రామానికి చెందిన మర్రిస్వామి (28) శుక్రవారం ఆత్మహత్య చేసుకున్నాడు. కొన్ని రోజులుగా అతని భార్య శాంతమ్మ, పిల్లలతో కలిసి పుట్టింట్లో ఉంటోంది. దీంతో ఒంటరిగా ఉన్న మర్రిస్వామి జీవితంపై విరక్తి చెంది.. తన తోటలోని మామిడి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు.

'అనంతలక్ష్మి'లో వికసిత్ భారత్ సమావేశం

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 2: అనంతలక్ష్మి ఇంజనీరింగ్ కళాశాలలో 'వికసిత్ భారత్ రూల్ ఆఫ్ ది ఇంజనీరింగ్ ఫ్యాకల్టీ' అంశంపై శుక్రవారం ఆన్‌లైన్ సదస్సును నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ రామమూర్తి తెలిపారు. దీన్ని ఐదురోజుల పాటు నిర్వహిస్తామన్నారు. భవిష్యత్‌కు అవసరమైన వివిధ అంశాలపై అధ్యాపకులు తర్ఫీదు పొందాల్సిన అవసరముందని హైదరాబాద్ ఏఆర్‌సీఐ శాస్త్రవేత్త సంజయ్ భరద్వాజ్ సూచించారు. కార్యక్రమంలో జేఎన్‌టీయూ రెక్టార్ విజయకుమార్, కళాశాల చైర్మన్ అనంతరాముడు, వైస్ చైర్మన్ రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గార్లదిన్నె, ఫిబ్రవరి 2: మండలంలోని కోటంక గుంటి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవాలయ ధర్మకర్తల నియామానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆలయ ఈఓ బాబు తెలిపారు. ఆలయానికి ధర్మకర్తలుగా గత కొంతకాలం ఎవరిని నియమించలేదని, మాఘమాసం నుంచి స్వామివారి తిరునాళ్ల ప్రారంభం అవుతుండటంతో ధర్మకర్తల నియామకానికి దేవదాయశాఖ నోటిఫికేషన్ విడుదల చేసిందని అన్నారు. ఆసక్తి ఉన్నవారు ఈనెల 20లోపు అనంతపురంలోని దేవదాయశాఖ సహాయ కమిషనర్ కార్యాలయంలో దరఖాస్తు అందజేయాలన్నారు.

11న రాష్ట్రస్థాయి పాటల పోటీలు

అనంతపురం ప్రెస్‌క్లబ్, ఫిబ్రవరి 2: ప్రముఖ గాయకుడు, పద్మశ్రీ డా. ఘంటసాల వర్ధంతిని పురస్కరించుకొని ఈ నెల 11న రాష్ట్రస్థాయి పాటల పోటీలను నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సంగీత కళాకారుడు, గాయకుడు సుధాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 96661 14810, 94935 61298ను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని, ఈ నెల 9 వరకూ ఆన్‌లైన్ ద్వారా గాయనీ, గాయకుల ఎంపిక ప్రక్రియ జరుగుతుందని, 11న విజేతలను ప్రకటిస్తామన్నారు.

కిడ్నీ ఆపరేషన్‌కు పోలీసులు, ఆర్డీటీ సహకారం

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2: రెండు కిడ్నీలు ఫెయిలై... కిడ్నీ మార్పిడి తప్పనిసరి పరిస్థితుల్లో ఓ కానిస్టేబుల్‌కు పోలీసులు సహకరించారు. జిల్లా ఎస్పీ అన్బురాజన్ ఆధ్వర్యంలో సహచర పోలీసు లు అండగా నిలిచారు. చేతనైనంత ఆర్థికసాయం అందించారు. ఆర్డీటీ సాయం తీసుకున్నారు. దాతల సాయంతో కిడ్నీ మార్పిడి చేయించుకుని విజయవంతంగా తిరిగొచ్చిన డీటీసీ కానిస్టేబుల్ రవికుమార్ తన కుటుంబసభ్యులతో కలిసి శుక్రవారం పోలీస్ కార్యాలయంలో ఎస్పీని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. పోలీసులు, ఆర్డీటీ రూ.10 లక్షలు సాయం చేశారని, ఎస్పీ చొరవ తీసుకోవడం వల్ల తాను పునర్జన్మతో తిరిగి యథాస్థితికి చేరుకున్నానని కానిస్టేబుల్ వివరించారు.

ఎస్కేయూ విద్యార్థులతో ముఖాముఖి

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 2: ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి అనే అంశంపై ఎస్కేయూ విద్యార్థులతో శుక్రవారం ముఖాముఖి నిర్వహించారు. భువన విజయ ఆడిటోరియంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైదరాబాద్ యూనివర్సిటీ ప్రొఫెసర్ వెంకటేష్, తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ చంద్రమోహన్ రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులు, అభివృద్ధి తదితర అంశాలపై విద్యార్థులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ నరసింహన్, ప్రొఫెసర్లు వెంకటరమణ, వెంకటనాయుడు, ఆంజనేయులు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు సత్యనారాయణ, చంద్రమౌళిరెడ్డి, మాధవి, రామిరెడ్డి, లక్ష్మన్న పాల్గొన్నారు.

మెగా డీఎస్సీ.. ఎన్నికల జిమ్మిక్కే

గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్



అనంతపురం అర్బన్, ఫిబ్రవరి 2: ఎన్నికల సమయంలో మెగా డీఎస్సీ పేరుతో సీఎం జగన్ నిరుద్యోగ యువతను మళ్లీ బురిడీ కొట్టిస్తున్నాడని గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గౌస్‌మొహిద్దీన్ మండిప డ్డారు. గత ఎన్నికలకు ముందు ఏటా జనవరిలో జాబ్ క్యాలెండర్ విడుదల చేసి యువతకు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని జగన్ హామీ ఇచ్చి ఆ వర్గాలను నట్టేట ముంచాడని శుక్రవారం స్థానిక తన క్యాంపు కార్యాలయంలో ఆయన ధ్వజమెత్తారు. వైసీపీ పాలనలో ఇంతకాలం ఒక్క నోటిఫికేషన్ కూడా ఇవ్వకుండా సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసేందుకు కుట్రలు పన్నుతున్నారన్నారు. మైనార్టీలకు ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తామని దగా చేశాడన్నారు. రాబోవు ఎన్నికల్లో అన్నివర్గాల ప్రజలు వైసీపీకి ఓటుతో తగిన బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.

ఓటరు జాబితాలో తప్పులను గుర్తించండి



వెస్టునరసాపురంలో మాట్లాడుతున్న దండు శ్రీనివాసులు

శింగనమల, ఫిబ్రవరి 2: ఓటరు జాబితాలో మరణించిన వారి, డబుల్, త్రిబుల్, స్థానికంగా లేని వారి ఓట్లను గుర్తించాలని రాష్ట్ర తెలుగు యువత అధికార ప్రతినిధి దండు శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని 3,4వ కస్టర్ ఇన్‌చార్జ్‌లు, కార్యకర్తలతో వెస్టునరసాపురం గ్రామంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కొత్తగా ఓటరు నమోదు, ఓటర్ వెరిఫికేషన్ తదితర విషయలపై అవగాహన కల్పించారు. టీడీపీ అమలు చేయబోయే సూపర్ సిక్స్ పథకాలపై ఓటర్లకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌చార్జ్ బండి పరుసురాం, గంగాధర్, కుళ్లాయప్ప, ఆదినారాయణ, కాయల సురేష్, బాలరాజు, నారాయణస్వామి పాల్గొన్నారు.

నేడు రాప్తాడులో 'జయహో బీసీ'

రాప్తాడు, ఫిబ్రవరి 2: స్థానిక టీడీపీ కార్యాలయంలో మాజీ మంత్రి పరిటాల సునీత ఆధ్వర్యంలో శనివారం మధ్యాహ్నం మూడు గంటలకు జయహో బీసీ సదస్సు నిర్వహిస్తున్నట్లు కన్వీనర్ కొండప్ప ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీసీ నాయకులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు అధికంగా తరలివచ్చి.. విజయవంతం చేయాలని కోరారు.

రేపు సిండికేట్ నగర్‌లో...

అనంతపురంరూరల్ : మండలంలోని రాచానపల్లి పంచాయతీ సిండికేట్ నగర్‌లో ఆదివారం మధ్యాహ్నం మూడు గంటలకు జయహో బీసీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలుగుదేశం పార్టీ మండల కన్వీనర్ జింకా సూర్య నారాయణ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని బీసీ నాయకు లు, కార్యకర్తలు, బీసీ కులస్థులందరూ పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు.

జూదరుల అరెస్ట్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2: స్థానిక శ్రీనివాసనగర్‌లోని సైఫుల్లా బ్రిడ్జి సమీపంలో జూదమాడుతున్న ఐదుగురిని శుక్రవారం అరెస్ట్ చేసినట్లు త్రీటౌన్ సీఐ ధరణికిషోర్ తెలిపారు. వారి నుంచి రూ.41,770 స్వాధీనం చేసుకున్నామన్నారు.

దుకాణాలపై విజిలెన్స్ దాడులు

అనంతపురం న్యూటౌన్, ఫిబ్రవరి 2: గార్లదిన్నెలోని గణేష్ ఫర్టిలైజర్స్, మన గ్రోమోర్ ఫర్టిలైజర్స్‌లో విజిలెన్స్ అధికారులు శుక్రవారం తనిఖీలు చేశారు. గణేష్ ఫర్టిలైజర్స్‌లో స్టాక్ రిజిష్టర్ అప్‌డేట్ చేయకపోవడంతో 6.50 ఎమ్‌టీఎస్ ఫర్టిలైజర్స్‌ను రూ.1,71,280 విలువగల స్టాకును స్టాప్ సేల్ నోటీసును అందజేశారు. మన గ్రోమోర్ ఫర్టిలైజర్స్‌లో ఎలాంటి వ్యత్యాలు లేనట్లు అధికారులు తెలిపారు. ఈ తనిఖీల్లో వ్యవసాయాధికారి వాసుప్రకాస్, డీసీటీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు రామగిరిలో గుండె వైద్య శిబిరం

రామగిరి : రామగిరిలో శనివారం గుండె వైద్య శిబిరాన్ని నిర్వహి స్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కిమ్స్ సవేరా ఆస్పత్రి ఆధ్వర్యంలో 2డీ ఎకో, డీఆర్‌డీఎస్, ఈసీజీ తదితర పరీక్షలను ఉచితంగా నిర్వహిస్తామని, ఈ వైద్యశిబిరం రామగిరిలోని అక్కమ్మగార్ల గుడి వద్ద ఉదయం 10 గంటలకు నిర్వహిస్తామని తెలిపారు.

కంటి వైద్య శిబిరం

రాప్తాడు, ఫిబ్రవరి 2: పుష్పగిరి కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో రాప్తాడులో బస్టాండు వద్ద శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర మహిళా ఉపాధ్యక్షురాలు సుమతి, అనంతపురం పార్లమెంట్ కన్వీనర్ లలిత్‌కుమార్, గొంది అశోక్, రాయలసీమ జోనల్ ఇన్‌చార్జ్ సూర్యప్రకాష్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ యాదవ్, కాటమయ్య ఈ శిబిరాన్ని ప్రారంభించారు. ఈ శిబిరానికి మొత్తం 120 మంది హాజరుకాగా వారిలో 50 మందికి ఆపరేషన్ అవసరమైనట్లు వైద్యులు గుర్తించారు.

పేదలను నిర్లక్ష్యం చేస్తున్న వైసీపీ



కలెక్టరేట్‌కు ర్యాలీగా వస్తున్న నాయకులు

అనంతపురం సెంట్రల్, ఫిబ్రవరి 2: పేదలకు కనీస సౌకర్యాలైన నివాస స్థలాలు, గృహ నిర్మాణాల తదితర వాటిని కల్పించకుండా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని జైభీమ్ పార్టీ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు శుక్రవారం కలెక్టరేట్ వరకూ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ కన్వీనర్ గౌరినరేష్, ఎమ్మార్పీఎస్ వెంకటేష్ మాట్లాడుతూ... పేదల అవసరాలను తీర్చేందుకు వినియోగించాల్సిన ప్రభుత్వ స్థలాలను అధికారులు పెద్దలకు కట్టబెడుతున్నారని మండిపడ్డారు. వేలాది మంది పొట్టచేతపట్టుకుని నగరానికి వలసవస్తూ రూరల్ ప్రాంతాల్లో తలదాచుకుంటున్నారన్నారు. కురుగుంట పరిధిలో అనేక సర్వే నెంబర్లలో ప్రభుత్వ స్థలాలు ఖాళీగున్నాయన్నారు. వాటిలో పేదలకు నివేశ స్థలాలను కేటాయించి పక్కాగృహాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతిపత్రాన్ని కలెక్టరేట్ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు లోకేష్, నరసింహులు, ముత్యాలన్న, షాహిద, రెడ్డెమ్మ, మహాలక్ష్మి, షాహిన్‌తాజ్, లక్ష్మీదేవి, కాంతమ్మ, గంగన్న, చౌడప్ప పాల్గొన్నారు.

టూటౌన్ సీఐగా క్రాంతికుమార్

అనంతపురం క్రైం, ఫిబ్రవరి 2: అనంతపురం టూటౌన్ సీఐగా శుక్రవారం క్రాంతికుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఇక్కడ పనిచేస్తున్న శివరాముడు కూడేరు యూపీఎస్‌కు బదిలీ అయిన విషయం తెలిసిందే. సీఐ క్రాంతికుమార్‌కు అధికారులు, సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

కార్మికులను రెగ్యులర్ చేయాలి: సీఐటీయూ

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 2 : విద్యుత్ కాంట్రాక్టు కార్మికులకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించి, వారి ఉద్యోగాలను రెగ్యులర్ చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్రకుమార్ డిమాండ్ చేశారు. శుక్రవారం యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో జిల్లా కార్మికశాఖ సహాయ కమిషనర్ రఘురాములుకు వినతిపత్రం అందజేశారు. విద్యుత్ రంగంలో జరుగుతున్న పరిణామాలు విద్యుత్ ఉద్యోగుల్లో అభద్రతాభావాన్ని కలిగిస్తున్నాయన్నారు. ఒకే సంస్థలో రెండు రకాల సర్వీస్ రెగ్యులేషన్స్ తీసుకురావడం విద్యుత్ ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగించే అంశమన్నారు. విద్యుత్ కంపెనీల్లో కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు వేతనాలు తగ్గించి చెల్లిస్తున్నారని, వారికి కూడా ట్రాన్స్‌కో, జెన్కోలతో సమానంగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సమస్యల పరిష్కారం కోసం ఈనెల 5వ తేదీ అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పించి, 8వ తేదీన అన్ని జిల్లా కేంద్రాల్లో సర్కిల్ ఆఫీసుల వద్ద ధర్నాలు, 12వ తేదీన విజయవాడలో నిరాహారదీక్షలు చేపడతామని తెలిపారు. కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు నబీరసూల్, ప్రధాన కార్యదర్శి మారుతికుమార్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి మధు, చెన్నకేశవ, స్టోర్ హమాలీ యూనియన్ నాయకులు రఫీ, కృష్ణారెడ్డి, హాజీబాషా పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

13 నుంచి సేవాలాల్ జయంత్యుత్సవాలు

పోస్టర్ విడుదల చేసిన కలెక్టర్

అనంతపురం కల్చరల్, ఫిబ్రవరి 2: గుత్తి మండలంలోని సేవాగడ్‌లో సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ 285వ జయంతి ఉత్సవాలను ఈనెల 13వ తేదీ నుంచి మూడు రోజులపాటు నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ గౌతమి పేర్కొన్నారు. అందుకు సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం కలెక్టరేట్‌లో ఆవిష్కరించిన కలెక్టర్ మాట్లాడారు. ఉత్సవాలు విజయవంతంగా నిర్వహించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. ఉత్సవాలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తగిన ఏర్పాట్లు చేయాలన్నారు. కార్యక్రమంలో డీటీడబ్ల్యూఓ రామాంజనేయులు, సేవాగడ్ ట్రస్టు ఉపాధ్యక్షుడు కేశవనాయక్, సేవాగడ్ ట్రస్టు ప్రధాన కార్యదర్శి, టీటీడీ బోర్డు సభ్యుడు అశ్వత్తనాయక్, కోశాధికారి బాలానాయక్ పాల్గొన్నారు.

నిరుద్యోగుల చెవిలో జగన్ 'డీఎస్సీ' పూలు

టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకుల నిరసన

అనంతపురం విద్య, ఫిబ్రవరి 2: ఇన్నాళ్లూ మౌనంగా ఉండి... ఎన్నికల ముందు డీఎస్సీ అంటూ సీఎం జగన్ నిరుద్యోగుల చెవిలో పూలు పెట్టాలని చూస్తున్నారని, ఆయనను నమ్మే స్థితిలో ఎవరూలేరని టీఎన్ఎస్ఎఫ్, తెలుగు యువత నాయకులు విమర్శించారు. ఆ మేరకు వారు శుక్రవారం స్థానిక అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా స్కూళ్లలో 18,520 ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉంటే, మోడల్ స్కూల్, సోషల్ వెల్ఫేర్, బీసీ వెల్ఫేర్, ఇతర గురుకుల పాఠశాలల్లో ఖాళీలు కలుపుకుని ఏకంగా 28 వేల టీచర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అయితే కేవలం ఆరు వేల పోస్టుల భర్తీకి ప్రభుత్వం యత్నిస్తోందన్నారు. ఆ పోస్టులను కూడా అప్రెంటిషిప్ విధానంతో భర్తీ చేయాలనుకోవడం దుర్మార్గమని మండిపడ్డారు. ఇన్నాళ్లు నిరుద్యోగుల ఆశలతో ఆడుకున్న సీఎం జగన్ కపటప్రేమను ఎవరూ నమ్మేపరిస్థితుల్లో లేరన్నారు. జగన్‌ను రాష్ట్రం నుంచి ఎల్లగొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు గుత్తా ధనుం జయనాయుడు, రాష్ట్ర నాయకులు లక్ష్మీ నరసింహ, తెలుగు యువత రాష్ట్ర నాయకులు వెంకటప్ప, జిల్లా అధికార ప్రతినిధి చీరాల నరేష్, జిల్లా ఉపాధ్యక్షులు నరేష్, కార్యదర్శులు శివకుమార్, సాకే వీరాంజినేయులు పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న నాయకులు

పెద్దారెడ్డిని గెలవకుండా అడ్డుకోవాలి : అశ్మిత్‌రెడ్డి


జేసీ అశ్మిత్‌రెడ్డి సమక్షంలో పార్టీలో చేరిన వైసీపీ మద్దతుదారులు

తాడిపత్రి, ఫిబ్రవరి 2: రాబోయే ఎన్నికల్లో మరోసారి వైసీపీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి గెలవకుండా మనమందరం ఓటు అనే ఆయుధంతో అడ్డుకోవాలని టీడీపీ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి పిలుపునిచ్చారు. పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీలో శుక్రవారం పలువురు వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అశ్మిత్‌రెడ్డి మాట్లాడుతూ టీడీపీ మేనిఫెస్టోకు ఆకర్షితులై అనేకమంది పార్టీలో చేరేందుకు ముందుకు వస్తున్నారన్నారు. వారందరికీ స్వాగతం పలుకుతున్నామన్నారు. మన లక్ష్యమంతా ఎమ్మెల్యే పెద్దారెడ్డిని గెలవకుండా అడ్డుకోవడమే అన్నారు. ఇప్పటికే ఒకసారి అవకాశం ఇచ్చి అనేక కష్టనష్టాలు పడ్డారని రాబోయే ఎన్నికల్లో గెలుపు కోసం ఆ పార్టీవారు ఎంతకైనా తెగిస్తారన్నారు. వాటన్నింటిని ఎదుర్కోవడానికి సిద్ధంగా ఉండాలన్నారు.

పార్టీలో చేరిన వైసీపీ మద్ధతుదారులు

పట్టణ సమీపంలోని గన్నెవారిపల్లికాలనీలో అశ్మిత్‌రెడ్డి సమక్షంలో వైసీపీ మద్ధతుదారుడు గురుమూర్తితోపాటు 60కుటుంబాలు టీడీపీలో చేరాయి. వారికి అశ్మిత్‌రెడ్డి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. జిల్లా ఉపాధ్యక్షుడు చింబిలి వెంకటరమణ, చవ్వా గోపాల్‌రెడ్డి, చింబిలి ప్రసాద్‌నాయుడు పాల్గొన్నారు.

సత్యసాయి నీటి సరఫరా కార్మికుల దీక్షలు


నిరాహార దీక్ష చేస్తున్న కార్మికులు

విడపనకల్లు, ఫిబ్రవరి 2: మండలంలోని 9 గ్రామాలకు తాగు నీటిని సరఫరా చేసే సీపీడబ్ల్యూఎస్ కాంట్రాక్ట్ కార్మికులుకు పెడింగ్ వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆర్‌డబ్ల్యూఎస్ కర్యాలయం ఎదుట శుక్రవారం నిరసన దీక్ష చేపట్టారు. కార్మికులు మాట్లాడుతూ ఆరు మాసాలుగా కాంట్రాక్టర్ వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నాడన్నారు. ప్రభుత్వం బిల్లులు మంజూరు చేయలేదని సాకులు చెబుతున్నాడని విమర్శించారు. వేతనాలు పెంచేంత వరకూ దీక్షలను విరమించేది లేదన్నారు. విడపనకల్లు, వజ్రకరూర్ గ్రామాల ప్రజలు కార్మికులకు సహకరించాలన్నారు.

వ్యక్తి ఆత్మహత్య


మద్రిస్వామి (ఫైల్)

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 2: ఒంటరి జీవితం భరించలేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన శెట్టూరు మండలం ఎర్రబోరేపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు మద్రిస్వామి(28) భార్య పుట్టింటికి వెళ్లిపోవడంతో తన తోటలోని మామిడి చెట్టుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తన భార్య శాంతమ్మ, పిల్లలతో కలిసి పుట్టింట్లో వుండటంతో ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. శుక్రవారం ఉదయం తోటలోకి వెళ్లిన తండ్రి వీరప్ప మామిడి చెట్టుకు వేలాడుతున్న కుమారుడిని చూసి కన్నీరు మున్నీరయ్యారు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మద్రిస్వామి మృతదేహాన్ని పోస్టుమార్టమ్ నిమిత్తం కళ్యాణదుర్గం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. శెట్టూరు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చెట్టుకొమ్మ మీద పడి కూలీ మృతి


చిన్నరాయుడు (ఫైల్)

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 2: చెట్టు కొమ్మను కోస్తుండగా ఆ కొమ్మ మీదపడి కూలీ మృతి చెందిన సంఘటన శుక్రవారం పట్టణంలో చోటు చేసుకుంది. మున్సిపల్ పరిధిలోని దొడగట్ట గ్రామానికి చెందిన చిన్నరాయుడు(32) రోజు కూలి నిమిత్తం తోటి కూలీలతో కలసి చెట్టు కోయడానికి వెళ్లాడు. చెట్టు కోస్తుండగా ఆ కొమ్మ మీద పడటంతో మృతిచెందాడు. ఇంటికి ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీటి పర్యంతమయ్యారు. చిన్నరాముడుకు అవివాహితుడు. ప్రభుత్వం మానవత్వంతో స్పందించి ఆ కుటుంబాన్ని ఆదుకోవాలని తోటి కూలీలు కోరుతున్నారు.

డ్రిప్ మందు తాగి 24 మేకలు మృతి


మృతి చెందిన మేకలు

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 2: శెట్టూరు మండలం మంగంపల్లి గ్రామంలోని యర్రిస్వామికి చెందిన మేకలను శుక్రవారం మేత కోసం తీసుకెళ్లాడు. మేత మేసిన తరువాత తోటలో మేకలకు నీరు తాగించాడు. నీటిలో డ్రిప్ మందు కలిసిందని తెలియక నీరు తాగించడంతో 24 మేకలు, ఒక పొట్టేలు చనిపోయాయి. జీవనాధారంగా ఉన్న మేకలన్నీ చనిపోవడంతో యర్రిస్వామి కన్నీరుమున్నీరయ్యాడు. ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితుడు కోరుతున్నాడు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం


ఇంటిలో కాలిపోయిన సామగ్రి

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 2: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పట్టణంలోని విజయనగర్‌కాలనికి చెందిన గౌసియా ఇల్లు దగ్ధమైనట్లు అగ్నిమాపక శాఖ ఎస్‌ఐ మోహన్‌బాబు తెలిపారు. గౌసియా కూలీ పనులు చేస్తూ జీవనం సాగిస్తోంది. శుక్రవారం పనులకు వెళ్లగా ఇంటిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కావడంతో బీరువా, వస్తు సామగ్రితో పాటు బంగారునగలు, నగదు కాలిపోయాయని తెలిపారు. సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పివేశారు. పట్టణ ఎస్‌ఐ రామకృష్ణ సిబ్బందితో కలిసి ఇంటిని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తామని పోలీసులు తెలిపారు.

రూ.35 లక్షల నగదు స్వాధీనం

రాయదుర్గంటౌన్, ఫిబ్రవరి 2: రాయదుర్గం పట్టణ పొలిమేరలో గాలి మారమ్మ గుడి వద్ద జాతీయ రహదారిపై కర్ణాటక నుంచి రాయదుర్గం వైపు వస్తున్న వాహనాన్ని తనిఖీ చేయగా ఓ వ్యక్తి నుంచి రూ. 35 లక్షల నగదును స్వాధీనం చేసుకుని తహసీల్దార్‌కు అప్పగించినట్లు సీఐ శ్రీనివాసులు తెలిపారు. నగదు విషయమై విచారణ చేయగా రైతు తన వేరుశనగ పంటకు సంబంధించి విక్రయించిన సొమ్మును చెళ్లకెర నుంచి తెస్తున్నట్లు విచారణలో వెల్లడైందన్నారు. విచారణ అనంతరం నగదును తిరిగి రైతుకు అప్పగించనున్నట్లు సీఐ తెలిపారు.

యువకుడికి గాయాలు

కూడేరు, ఫిబ్రవరి 2: మండలంలోని శివరాంపేట గ్రామ సమీపంలో నిలబడి ఉన్న ద్విచక్రవాహనాన్ని లారీ ఢీ కొట్టడంతో లోకేష్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు కూడేరు నుంచి వెళుతున్న లారీ ముద్దలాపురం ఫ్యాక్టరీ వద్దకు రావాల్సి ఉంది. అయితే డ్రైవర్ మద్యం మత్తులో శివరాంపేట వరకు వెళ్లిపోయాడు. రోడ్డుపక్కన ద్విచక్ర వాహనంపై నిలబడి ఉన్న లోకేష్‌ను ఢీకొనడంతో ప్రమాదం చోటు చేసుకుంది. గాయపడిన లోకేష్‌ను స్థానికులు సమీపంలోని ఆసుపత్రికి తరలించారు.

పోలీసుల అదుపులో గుప్త నిధుల వేటగాళ్లు?

యాడికి, ఫిబ్రవరి 2: మండలంలో 8మంది గుప్తనిధుల వేటగాళ్ల పోలీసుల అదుపులో ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. గుడిపాడు, బోయరెడ్డిపల్లి, నిట్టూరు గ్రామాల పరిధి మధ్యలో ఉన్న కొండప్రాంతంలో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరుగుతున్నాయని పోలీసులకు సమాచారం వచ్చినట్లు చర్చించుకుంటున్నారు. పోలీసులు దాడిచేసి గుప్త నిధుల వేటగాళ్లను అదుపులోకి తీసుకున్నట్లు తెలిసింది.

రిజర్వాయరులో నీటి నిల్వ 0.461 టీఎంసీలు

బెళుగుప్ప, ఫిబ్రవరి 2: మండలంలోని జీడిపల్లి రిజర్వాయరులో నీటి నిల్వ 0.461 టీఎంసీలు వున్నట్లు శుక్రవారం హంద్రీనీవా అధికారులు తెలిపారు. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో 469 క్యూసెక్కులు వుండగా ఇక్కడి నుంచి ఫేజ్-2కు ఔట్‌ఫ్లో 400 క్యూసెక్కులు వెళుతోందని వెల్లడించారు.

చంద్రబాబుతోనే రాష్ట్ర భవిష్యత్తు

● బస్సుయాత్రలో జేసీ ప్రభాకర్‌రెడ్డి

యాడికి, ఫిబ్రవరి 2: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్ర భవిష్యత్తు సాధ్యమని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎన్. కొత్తపల్లి, నిట్టూరు, చిక్కేపల్లి, తిప్పారెడ్డిపల్లి, కొట్టాలపల్లి, పెండేకల్లు, తిమ్మాపురం, వేములపాడు, నగరూరు గ్రామాల్లో యువచైతన్య బస్సుయాత్ర నిర్వహించారు. ఆయా గ్రామాల్లో


కొట్టాలపల్లిలో ప్రభాకర్‌రెడ్డికి హారతి పడుతున్న మహిళ

విస్తృతంగా పర్యటించారు. గ్రామస్థులు ఆయనకు బ్రహ్మరథం పట్టారు. ప్రజల సమస్యలను తెలుసుకున్నారు. చిక్కేపల్లిలో వారంరోజుల నుంచి నీరు రావడం లేదని మహిళలు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. జేసీ మాట్లాడుతూ వైసీపీ పాలనలో రాష్ట్రానికి రాజధాని ఏది అనే ప్రశ్నకు సమాధానం లేకుండా పోయిందన్నారు. వైసీపీ పాలనపట్ల ప్రజలు విసుగు చెందారన్నారు. రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం కావాలంటే చంద్రబాబు రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావాలన్నారు. బస్సుయాత్రలో క్లాస్-1 కాంట్రాక్టర్ చవ్వా గోపాల్‌రెడ్డి, మాజీ ఎంపీపీ వేలూరు రంగయ్య, తెలుగుయువత జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ పరిమి చరణ్, నిట్టూరు సర్పంచు ఈశ్వరమ్మ, తెలుగు మహిళ జిల్లా కార్యదర్శి విజయలక్ష్మి, మండల కార్యదర్శి అనిత, టీడీపీ నాయకులు మృత్యుంజయనాయుడు, జగదీష్, శ్రీనివాసులు, రాజారెడ్డి, త్రినాథ్‌రెడ్డి, నాగిరెడ్డి, దివాకర్‌రెడ్డి, ఆదినారాయణ, రామచంద్రారెడ్డి, అఖిల్‌రెడ్డి, రామాంజనేయులు, హరి, రాఘవ, నరసింహులు, కేశవచౌదరి, వేణు, బాలాంజనేయులు, బొట్టు శేఖర్, మధురాజు, విజయ్, బయపురెడ్డి, గోపాల్‌నాయుడు పాల్గొన్నారు.

ఐపీఎస్ చదువుతానంటూ కన్నీటి పర్యంతమైన బాలిక


జేసీపీఆర్ వద్ద కన్నీటి పర్యంతమవుతున్న విద్యార్థిని గౌతమి

తాను ఐపీఎస్ చదువుతానంటూ గౌతమి అనే ఆరో తరగతి విద్యార్థిని తాడిపత్రి మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి వద్ద కన్నీటి పర్యంతమైంది. ఈ సంఘటన శుక్రవారం మండలంలోని నగరూరు గ్రామంలో జేసీ నిర్వహిస్తున్న బస్సుయాత్రలో చోటు చేసుకుంది. నగరూరు గ్రామంలో జేసీ పర్యటిస్తున్న సమయంలో గౌతమి అనే విద్యార్థి ఆయన వద్దకు వచ్చి కన్నీటి పర్యంతమైంది. ఆయన బాలికను ఓదార్చి ఎందుకు ఏడుస్తున్నావు అని ఆరాతీశారు. తాను ఐపీఎస్ చదువుతానని తెలిపింది. నీవు ఏడవకుండా కష్టపడి బాగా చదువుకో... నీకు ఏ ఇబ్బంది ఉండదు.... ఏదైనా సాయం కావాలంటే నేను చూసుకుంటానని భరోసా ఇచ్చాడు.

రాక్షస ప్రభుత్వానికి చరమగీతం పాడుదాం


కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఉమామహేశ్వరనాయుడు


బ్రాహ్మణపల్లిలో కరపత్రం అందజేస్తున్న పత్తి హిమబిందు

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమా

కళ్యాణదుర్గం, ఫిబ్రవరి 2: రాక్షస ప్రభుత్వానికి చరమగీతం పాడేందుకు సిద్ధంగా వుండాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి ఉమామహేశ్వరనాయుడు పిలుపునిచ్చారు. శుక్రవారం శెట్టూరు మండలం ముచ్చర్లపల్లిలో బాబు ష్యూరిటీ భవిషత్తు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉమామహేశ్వరనాయుడుకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికి తిరుగుతూ సూపర్‌సిక్స్ పథకాలను వివరిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ఈ రోజు ఎక్కడ చూసినా వైసీపీ ప్రభుత్వాన్ని సొంత పార్టీ నాయకులే ఛీదరించుకునే స్థాయికి వచ్చారంటే ఆ పార్టీ ఏస్థాయికి దిగజారిందో స్పష్టంగా అర్థమవుతోందన్నారు. మన రాష్ట్రం, మన ప్రాంతం, మన ఊరు బాగుపడాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమవుతుందని, అందుకోసం మనమందరం సమష్టిగా కృషిచేసి చంద్రబాబునాయుడును గెలిపించుకోవాలన్నారు.

చంద్రబాబును ముఖ్యమంత్రి చేసుకోవాలి

గుత్తిరూరల్: రాష్ట్రం బాగుండాలంటే చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రిని చేసుకోవాలని టీడీపీ డాక్టర్స్ సెల్ జిల్లా అధ్యక్షురాలు పత్తి హిమబిందు అన్నారు. మండలంలోని బ్రాహ్మణపల్లిలో గ్రామంలో శుక్రవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. రాష్ట్రంలో ఓటర్లు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఓటును సరిచూసుకోవాలని ఓటర్లకు అవగహన కల్పించారు. చంద్రబాబుతోనే రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందన్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ పథకాల గురించి మహిళలకు వివరించారు. దేవరపల్లి సర్పంచు, ప్రతాప్ టీడీపీ నాయకులు నారాయణ, ఆనంద్, మాజీ సర్పంచు రామస్వామి, రంగస్వామి, తిరుపాల్, జానికి, రాధ పాల్గొన్నారు.

చంద్రబాబుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు

కుందుర్పి: చంద్రబాబునాయుడుతోనే రాష్ట్రానికి భవిష్యత్తు వుంటుందని మండల కన్వీనర్ ధనుంజయ అన్నారు. శుక్రవారం బాబు ష్యూరిటీ


కుందుర్పిలో కరపత్రాలు పంచుతున్న ధనుంజయ, టీడీపీ నాయకులు

భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా కుందుర్పి, వడ్డీపాళ్యం గ్రామాల్లో కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజలను చైతన్యపరుస్తూ చంద్రబాబు నాయుడు మళ్లీ ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్ర భవిష్యత్తు బాగుంటుందని అన్నారు. శ్రీనివాసులు, విజ్జి పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి టీడీపీతోనే సాధ్యం

కళ్యాణదుర్గం: గ్రామాలు అభివృద్ధి చెందాలంటే టీడీపీతోనే సాధ్యమని ఆ పార్టీ నాయకులు అన్నారు. శుక్రవారం మండలలోని మంగలకుంట గ్రామంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కరపత్రాలు పంపిణీ చేస్తూ కార్యక్రమ ముఖ్య ఉద్దేశాన్ని వివరించారు. గోళ్ల వెంకటేశులు, డీకే రామాంజనేయులు, గాజుల శ్రీరాములు, ఉన్నం వరలక్ష్మీ పాల్గొన్నారు.


కళ్యాణదుర్గం మండలం మంగలకుంటలో...

అండర్ డ్రైనేజీ పనుల పరిశీలన

తాడిపత్రి, ఫిబ్రవరి 2: పట్టణంలోని టైలర్స్‌కాలనీలో జరుగుతున్న అండర్‌డ్రైనేజీ మరమ్మతు పనులను శుక్రవారం టీడీపీ ఇన్‌చార్జి జేసీ అశ్మిత్‌రెడ్డి పరిశీలించారు. మరమ్మతుల పేరుతో రోడ్డును పగలగొట్టి రెండు నెలలైనా వైసీపీ మద్దతుదారులు పట్టించుకోకపోవడంపై స్పందించిన మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి సొంత నిధులతో పనులను ప్రారంభించారు. నాలుగురోజులుగా జరుగుతున్న పనులు చివరి దశకు వచ్చాయి. పనులను వేగవంతంచేసి పూర్తిచేయాలని సిబ్బందికి అశ్మిత్‌రెడ్డి సూచించారు.

ప్రతిభా విద్యార్థులకు అభినందన


విద్యార్థులు, ఉపాధ్యాయుడిని అభినందిస్తున్న దృశ్యం

గుత్తి, ఫిబ్రవరి 2: పట్టణంలోని కోట వీధి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు దక్షిణ భారత దేశ వైజ్ఞాన ప్రదర్శనలో ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల ప్రాధానోపాధ్యాయుడు సుభాన్ తెలిపారు. పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న బెన్ని, మహేంద్రరెడ్డి సైన్స్ పోటీల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ప్రథమ స్థానాలు సాధించారన్నారు. విజయవాడలో నిర్వహించిన దక్షిణ భారత దేశ వైజ్ఞానిక ప్రదర్శనలో ప్రతిభ కనబరిచి నాల్గవ స్థానాన్ని సాధించారన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం పాఠశాలలో ప్రాధానోపాధ్యాయుడు సుభాన్ ఆధ్వర్యంలో ప్రతిభ విద్యార్థులకు, సైన్స్ ఉపాధ్యాయుడు శ్యాముల్‌ప్రతాప్‌కు శాలువ వేసి పూలమాలతో ఘనంగా అభినందించారు.

శివానంద కుటుంబ సభ్యులకు పరామర్శ

గుంతకల్లు టౌన్, ఫిబ్రవరి 2: వజ్రకరూరులో ట్రాక్టర్ ఢీకొని మృతి చెందిన మున్సిపల్ కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగి శివానంద కుటుంబ సభ్యులను టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి పవన్‌కుమార్ గౌడ్ శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. ఆసుపత్రిలోని మార్చురిలో శివానంద మృతదేహాన్ని పరిశీలించారు. టీడీపీ యువనాయకుడు అనిల్‌గౌడ్, హనుమంతు, నందీశ్వర్, మధు, నెట్టికల్లు, వన్నూరు ఉన్నారు.

కూడేరు సీఐగా శివరాముడు

కూడేరు, ఫిబ్రవరి 2: కూడేరు పోలీస్‌స్టేషన్ అప్‌గ్రేడ్ కావడంతో ఉన్నతాధికారులు సీఐగా శివరాముడుకు పోస్టింగ్ ఇచ్చారు. శుక్రవారం స్టేషన్‌లో ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈయన అనంతపురం టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో సీఐగా పనిచేసి కూడేరుకు బదిలీపై వచ్చారు. ఇక్కడ పనిచేస్తున్న ఎస్‌ఐ సత్యనారాయణ శ్రీ సత్యసాయి జిల్లాకు బదిలీ అయ్యారు.

బాధ్యతల స్వీకరణ

ఎంపీడీఓ, ఎస్‌ఐ, తహసీల్దార్లుగా శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గుంతకల్లు డీఎస్పీగా శివభాస్కర్‌రెడ్డి, పుట్లూరు ఎస్‌ఐగా హేమాద్రి, డీ హీరేహాల్ ఎస్‌ఐగా గురుప్రసాద్ రెడ్డి, యల్లనూరు ఎస్‌ఐగా గిరి ప్రసాద్ బాధ్యతలు స్వీకరించారు. అలాగే గుత్తి తహసీల్దార్‌గా భారతి, యాడికి ఎంపీడీఓగా సావిత్రి, బెళుగుప్పకు సుబ్బరాజు, గుత్తికి శ్రీనివాసులు, పామిడికి శ్రీనివాసరావు, గుమ్మఘట్టకు గౌరీదేవి, తాడిపత్రికి నరసింహారావు, పెద్దపప్పూరుకు కవిత, పెద్దవప్పూరుకు గోపీకృష్ణ, కుందుర్పి చంద్రశేఖర్ బాధ్యతలు చేపట్టారు.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

వచ్చీ రాగానే..!

● ఎంపీపీని ఇంటివద్దకు వెళ్లి సన్మానించిన ఎంపీడీఓ


ఇంటివద్ద ఎంపీపీని సన్మానిస్తున్న ఎంపీడీఓ సావిత్రి చిత్రంలో వైసీపీ నాయకుడు

యాడికి, ఫిబ్రవరి 2: బదిలీపై వచ్చి బాధ్యతలు చేపట్టిన వెంటనే ఎంపీడీఓ సావిత్రి ఎంపీపీ ఇంటివద్దకు వెళ్లి సన్మానం చేశారు. దీనిపై స్థానికంగా పెద్దఎత్తున విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల నేపథ్యంలో ఇటీవల అధికారుల బదిలీలు జరిగాయి. ఇందులో భాగంగా యాడికి ఎంపీడీఓగా సావిత్రి నియమితులయ్యారు. శుక్రవారం బాధ్యతలు చేపట్టిన ఆమె ఎంపీపీ ఇంటివద్దకు వచ్చి ఆమెను సన్మానించారు. ఎంపీపీ భర్త వైసీపీ మండల కన్వీనర్‌గా ఉండడం గమనార్హం. ఎంపీపీ కార్యాలయంలో సన్మానం చేసి ఉంటే ఎవరికీ అభ్యంతరాలు ఉండవని స్థానికులు అంటున్నారు.

పాలిసెట్ ప్రవేశ పరీక్ష కేంద్రానికి అనుమతి

గుంతకల్లుటౌన్, ఫిబ్రవరి 2: పట్టణంలో 2024 పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష (పాలిసెట్)ను నిర్వహించేందుకు సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నాగరాణి అనుమతి ఇచ్చినట్లు పాలిసెట్ కోఆర్డినేటర్ కే ఆశిఫ్ అలీ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గతంలో విద్యార్థులు వందల కిలోమీటర్ల దూరం వెళ్లి పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్ష కేంద్రాలకు హాజరయ్యేవారన్నారు. ఈ అవకాశాన్ని పదో తరగతి విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. పరీక్ష కేంద్రం అనుమతి ఇవ్వడాన్ని కమిషనర్ నాగరాణి, కోఆర్డినేటర్ ఆశిఫ్ అలీకు కళాశాల ప్రిన్సిపాల్ వీరస్వామి, ఆధ్యాపకులు కృతజ్ఞతలు తెలిపారు.

కారు చోరీ కేసు దర్యాప్తులో వెలుగుచూసిన హత్య

చంద్రగిరి, ఫిబ్రవరి 2: చంద్రగిరి పోలీసులు కారు చోరీ కేసు దర్యాప్తు చేస్తుండగా.. ఎనిమిది నెలల క్రితం జరిగిన ఓ మహిళ హత్య కేసు వెలుగు చూసింది. నిందితులను అరెస్ట్ చేశారు. శుక్రవారం తిరుపతి జిల్లా చంద్రగిరిలో డీఎస్పీ యశ్వంత్ కేసు తెలిపిన వివరాల మేరకు.. తాడిపత్రికి చెందిన గ్రానైట్ వ్యాపారి నరేంద్రనాథరెడ్డితో అనంతపురానికి చెందిన జయమ్మ(35) సహజీవనం చేస్తుండేది. వీరికి ఒక కుమారుడు పుట్టాడు. తరువాత నరేంద్రనాథ్‌రెడ్డి మరో వివాహం చేసుకుని చంద్రగిరి మండలం బుచ్చినాయుడుపల్లె వద్ద దున్నలు, పొట్టేళ్లు, నాటు కోళ్ల ఫామ్ పెట్టి స్థిరపడ్డాడు. జయమ్మకు పుట్టిన శరణ్‌కుమార్‌రెడ్డిని నరేంద్రనాథ రెడ్డి తన వద్దే ఉంచుకున్నాడు. దీంతో జయమ్మ అపుడప్పుడూ బుచ్చినాయుడుపల్లెకు వచ్చి నరేంద్రనాథరెడ్డి తనను మోసం చేశాడని, తన బిడ్డను కూడా దూరం చేశాడని గొడవ పెట్టుకునేది. ఈ నేపథ్యంలో గత సంవత్సరం మే 25వ తేదీన నరేంద్రనాథరెడ్డిని ఫారం వద్దకు వచ్చిన జయమ్మ నిలదీస్తుండగా అతడి వద్ద పనిచేస్తున్న ఓబులేశు పికాసితో ఆమె తలపై కొట్టాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అదేరోజు రాత్రి జయమ్మ మృతదేహాన్ని నరేంద్రనాథరెడ్డి తన కారులో వేసుకుని ఓబులేశు, తన వద్ద పనిచేసే అప్పారావు, రఘుపతి రాజులతో కలిసి అన్నమయ్య జిల్లా రాజంపేట వద్ద చెయ్యూరు చెరువు వంకలో పూడ్చిపెట్టారు. కాగా జయమ్మ కనిపించడంలేదంటూ ఆమె సోదరుడు దేవేంద్ర అనంతపురం నాల్గవ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. జయమ్మను హత్య చేసినందుకు ఒక్కొక్కరికి రూ.5 లక్షలు ఇస్తానని నరేంద్రనాథరెడ్డి హామీ ఇచ్చాడు. అయితే డబ్బులు ఇవ్వకపోవడంతో అప్పారావు అతని కారు చోరీ చేశాడు. పది రోజుల క్రితం నరేంద్రనాథరెడ్డి తన కారు చోరీ అయిందని చంద్రగిరి స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా కారు చోరీ చేసిన అప్పారావును పోలీసులు అరెస్ట్ చేసి విచారించారు. దీంతో జయమ్మ హత్య వెలుగులోకి వచ్చింది. అప్పారావు ఇచ్చిన సమాచారం మేరకు చంద్రగిరి పోలీసులు శుక్రవారం కళ్యాణి డ్యామ్ వద్ద నరేంద్రనాథరెడ్డి, ఓబులేశులను అరెస్ట్ చేశారు. రఘుపతి రాజు పరారీలో ఉన్నట్లు డీఎస్పీ యశ్వంత్ తెలిపారు.

వైసీపీ పాలనలో యువత భవిష్యత్తు బుగ్గిపాలు

● టీడీపీ నాయకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి


మాట్లాడుతున్న జీవానందరెడ్డి

పామిడి, ఫిబ్రవరి 2: వైసీపీ పాలనతో యువత భవిష్యత్తు బుగ్గిపాలు అయ్యిందని టీడీపీ నాయకుడు పెరుమాళ్ల జీవానందరెడ్డి మండిపడ్డారు. మండలంలోని గజరాంపల్లి గ్రామంలో వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో వైసీపీ అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నిరుద్యోగుల జీవితాల్లో చీకట్లు అలుముకున్నాయన్నారు. ఉద్యోగావకాశాలు లేక యువత పెడదోవ పడుతున్నారన్నారు. ఏ ఉద్యోగం లభించకపోవడంతో వ్యవసాయ, కూలి పనులకు వెళుతున్నారన్నారు. గజరాంపల్లి గ్రామంలో యువతులు, మహిళల స్వయం ఉపాధి కోసం ఏర్పాటు చేస్తున్న వ్యాలీ గ్రీన్ గార్మెంట్స్ అనుమతులు, నిర్మాణానికి వైసీపీ నాయకులు ఎంతగానో అడ్డు తగిలారన్నారు. అయినా అన్ని అడ్డంకులను అధిగమించి పరిశ్రమను స్థాపించామన్నారు. తెలుగుదేశం పార్టీ ఆదేశాల మేరకు ఫస్ట్ ఓట్ ఫర్ సీబీఎన్ కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గంలోని డిగ్రీ కళాశాలల్లోని యువతకు అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. కమిటీలో స్థానం కల్పించినందుకు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పాలాక్షిరెడ్డి, హరీష్, నాగార్జున, సంజీవ పాల్గొన్నారు.

ఎంపీడీఓ ప్రభాకర్ సేవలు ఎనలేనివి


ఎంపీడీఓను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

పామిడి, ఫిబ్రవరి 2: మండలంలో ఎంపీడీఓగా విధులు నిర్వహించిన ప్రభాకర్ నాయక్ సేవలు ఎనలేనివని వక్తలు కొనియాడారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శుక్రవారం బదిలీ అయిన ప్రభాకర్‌నాయక్‌కు వీడ్కోల సభ నిర్వహించారు. సభకు సీఐ రాజశేఖర్ రెడ్డి, ఎంపీపీ మురళిమోహన్ రెడ్డి, మాజీ ఎంపీపీ నారాయణరెడ్డి హాజరయ్యారు. అనంతరం ఎంపీడీఓకు శాలువాలు కప్పి పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. వైస్ ఎంపీపీ కాయల మహేష్, ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మూలి నాగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

వైభవంగా చౌడేశ్వరీదేవి జ్యోతుల ఉత్సవం


పంచమ జ్యోతులను ఊరేగిస్తున్న భక్తులు

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 2: పట్టణంలోని నేసేపేటలో వెలసిన చౌడేశ్వరీదేవి మహోత్సవాలు తొగటవీర క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ఉదయాన్నే గంగపూజ, పంచామృతాభిషేకం, వస్త్రాలంకరణ, పుష్పాలంకరణ తదితర పూజలు నిర్వహించారు. అనంతరం అమ్మవారికి పంచమజ్యోతుల మహోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. పట్టణ పురవీధుల్లో పంచమజ్యోతుల మహోత్సవాన్ని చేపట్టారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. తొగటవీరక్షత్రియ సంఘం నాయకులు, భక్తులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఇలా గుచ్చుకోవడం.. ఇక్కడి ఆచారం


భక్తురాలి మెడకు సూది గుచ్చుతున్న దృశ్యం

కళ్యాణదుర్గంరూరల్, ఫిబ్రవరి 2: ఇక్కడికి వచ్చిన భక్తులు గొంతుకు, చెక్కిళ్లకు దబ్బనాలు (పెద్ద సూదులు) గుచ్చుకుంటుంటే తమ మొక్కులు నెరవేరుతాయి అని ఇక్కడి భక్తుల ప్రగాఢ విశ్వాసం. కళ్యాణదుర్గం మండలం మల్లిపల్లి గ్రామంలో ప్రతి ఏటా నిర్వహించే చౌడమ్మ జాతరలో ఆలయ నిర్వాహకులు జ్యోతులు తీసుకుని బయలుదేరే సమయంలో వందలాదిగా వచ్చిన భక్తుల్లో చిన్నారులు, మహిళలు చన్నీటి స్నానం చేసి తమ గొంతులో చెక్కిళ్లలో ఎనిమిది నుంచి పది అంగుళాల పొడవున్న సూదులు కుచ్చుకుని తమ మొక్కులు తీర్చుకున్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు భద్రత ఏర్పాటు చేశారు.

స్వాతి నక్షత్ర పూజలు

తాడిపత్రిటౌన్, ఫిబ్రవరి 2: మండలంలోని ఆవులతిప్పాయపల్లి గ్రామసమీపంలో వెలసిన ఓబులేసుకోన ఆలయంలో శుక్రవారం స్వామివారి జన్మనక్షత్రమైన స్వాతినక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేత నరసింహస్వామికి విశేష పూలతో అలంకరించి పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో స్వామివారిని దర్శించుకున్నారు. నిర్వాహకులు భక్తులకు అన్నదాన చేశారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

గుత్తి, ఫిబ్రవరి 2: మున్సిపల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాలని మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసులు, సెక్టార్ అధికారులు శుక్రవారం పరిశీలించారు. ఎంఎస్ జూనియర్ కళాశాల, జిల్లాపరిషత్ బాలిక, బాలుర ఉన్నత పాఠశాలలతో పాటు ఇతర పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. సెక్టార్ అధికారులు గురుప్రసాద్, లక్ష్మీనరసయ్య, సూర్యనారాయణ, రఘు, సాయినాథ్‌బాబు, మురళీధర్, మహబూబ్ జాన్, ఇమామ్ హుసేన్ పాల్గొన్నారు.

కాలవ పర్యటనను విజయవంతం చేయండి

రాయదుర్గంరూరల్, ఫిబ్రవరి 2: మాజీ మంత్రి కాలవ శ్రీనివాసులు పర్యటనను విజయవంతం చేయాలని డీ.హీరేహాళ్ మండల కన్వీనర్ హనుమంతరెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం కాలవ శ్రీనివాసులు నివాసంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డీ.హీరేహాళ్ మండలం ఓబుళాపురం గ్రామంలో మన కోసం మన శీనన్న అనే కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కాలవ శ్రీనివాసులు హాజరవుతున్నట్లు తెలిపారు. ఓబుళాపురం చెక్‌పోస్టు నుంచి ఓబుళాపురం వరకు బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఓబుళాపురం గ్రామానికి చెందిన 150 వైసీపీ కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరనున్నట్లు తెలిపారు.

సాఫీగా సర్వసభ్య సమావేశం

బ్రహ్మసముద్రం, ఫిబ్రవరి 2: మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. ఎంపీపీ చంద్రశేఖర్ రెడ్డి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఆయా శాఖల అధికారులు ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. ఎంపీడీవో దాసానాయక్, పంచాయతీరాజ్ జేఈ విజయల కృష్ణ, ఎంఈవో ఓబుళపతి, వైద్యాధికారి రాజేష్‌కుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు ఇతర శాఖల అధికారులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక

ఉరవకొండ, ఫిబ్రవరి 2: ఆడుదాం ఆంధ్రా రాష్ట్రస్థాయి ఖో-ఖో పోటీలకు ఆమిద్యాల జట్టు ఎంపికైంది. అనంతపురంలో జరిగిన జిల్లాస్థాయి ఖోఖో పోటీల్లో ఆమిద్యాల, గొల్లపల్లి ఖోఖో జట్లు తలపడగా ఆమిద్యాల జట్టు విన్నర్‌గా నిలిచింది. గెలుపొందిన క్రీడాకారులకు రాజేష్ బహుమతులు అందజేశారు. పీఈటీ మారుతి, గ్రామస్థులు పాల్గొన్నారు.